మానేరు
# జనత®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

27.2.2025 గురువారం Thursday | సంపుటి (Volume): 09 సంచిక (Issue) : 316 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar


ఉత్కంఠ పోరులో
## అఫ్గాన్ విజయం


07


సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


# మెట్రో ఫేజ్-2కు అనుమతి ఇవ్వండి

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

- ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయండి
- మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ కు నిధులు ఇవ్వండి
- రీజినల్ రింగ్ రైల్.. డ్రైపోర్ట్‌లు మంజూరు చేయండి
- సెమీ కండక్టర్ మిషన్‌కు అనుమతించండి




హైదరాబాద్ మహా నగరంలో మెట్రో రైలు సౌకర్యం అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు అనుమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు.

**న్యూఢిల్లీ, జనతా న్యూస్:** హైదరాబాద్ నగరంలో ఫేజ్-2 కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు కారిడార్లను ప్రతిపాదించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు వెంటనే అనుమతిం చాలని అభ్యర్థించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూ సేకరణ పూర్తయినందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని మోదీని రేవంత్ రెడ్డి కోరారు.

మిగతా 2 లో

## మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి మోకాలడ్డు

- తనకు పేరొస్తుందనే అడ్డుపుల్లలు వేస్తున్నారు
- అనుమతులు తెస్తే గండపెండేరం తొడుగుతా
- సొరంగం వద్ద సహాయక చర్యలు ముమ్మరం
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి


02

## ఫ్లయిట్ డిలే!

సాయంత్రం 7 గంటలకు వెళ్లాల్సిన విమానం 10:30కు..
శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా
## ఒరిగేదేమీ లేదు
### మాజీ మంత్రి కేటీఆర్



సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లు ఢిల్లీ టూర్‌కు వెళ్లిన తెలంగాణకు ఒరిగేదేమీ లేదని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. 36 సార్లు ఢిల్లీకి పోయినా మూడు రూపాయలు తెచ్చింది లేదని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలి 8 మంది కార్మికులు చిక్కుకుంటే.. ఎన్నికల ప్రచారంలో మునిగి తేలావని మండిపడ్డారు.


03


దోషులుగా తేలిన నేతలపై
## జీవిత కాలం నిషేధం

సుప్రీంలో కేసుపై స్పందించిన కేంద్రం
అది ఆమోదయోగ్యం కాదన్న కేంద్రం
ఆరేళ్ల నిషేధం సరిపోతుందని నివేదిక


03

## ఫార్మసీరంగంలో ముందంజ

బయో ఏషియా ముగింపు సదస్సు లో కిషన్ రెడ్డి


03

## ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

మొత్తం 18,180 మందికి రూ. 6వేల చొప్పున జమ

# రెండ్రోజుల్లో ఆపరేషన్ పూర్తి

- నిపుణులు అదేపనిలో ఉన్నారన్న ఉత్తమ్
- ఐదు రోజులుగా కొనసాగుతున్న రెస్క్యూ పనులు
- బాధితులను బయటకు తీసుకొచ్చేందుకు శ్రమిస్తున్న 11 సంస్థలు


02

సొరంగం నుంచి వారిని బయటకు తీసేందుకు టన్నెల్ ఎక్స్‌పర్ట్స్, రిటైర్డ్, ఉద్యోగంలో ఉన్న ఆర్మీ ఆఫీసర్లను తీసుకొచ్చామని, వారిని సొరంగంలోనికి పంపించామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. పూర్తిస్థాయిలో డీ వాటరింగ్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని, లోపల టన్నల్ బోరింగ్ మెషిన్ ఏదైతో కోలాప్స్ అయిందో దాన్ని గ్యాస్ కటర్స్ తొలగించడం జరుగుతుందన్నారు. అందరిని కచ్చితంగా ఆపరేషన్ పూర్తి చేసి బయటకు తీసుకువస్తామని అనుకుంటున్నామని ఉత్తమ్ పేర్కొన్నారు.

# నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు

ఏడు ఉమ్మడి జిల్లాల్లో పోలింగ్ ఏర్పాట్లు

హైదరాబాద్, జనతా న్యూస్: తెలంగాణలో గ్రాడ్యుయేట్, టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఈ ఎన్నికలు జరుగతనున్నాయి. 7 ఉమ్మడి జిల్లాల్లో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది ఎన్నికల సంఘం. ఈ క్రమంలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు ఇలా త్రిపాఠి. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పాత 3 జిల్లాలు, కొత్తగా ఏర్పడ్డ 12 జిల్లాల అధికారుల కోఆర్డినేషన్ బాగుందని.. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తామని అన్నారు. సుమారు రెండు వేల మంది సిబ్బందితో ఎన్నికలు నిర్వహణ జరుగుతుందని అన్నారు త్రిపాఠి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు






# హరహర మహాదేవ

## శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు

- ప్రధాన ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన ప్రముఖులు

మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని శైవక్షేత్రాలు హరోం హర నామస్మరణతో మారుమోగాయి. విద్యుత్ దీప కాంతులతో శివాలయాలు వెలుగీనా యి. పరమేశ్వరుడి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.





# మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి మోకాలడ్డు

**తనకు పేరొస్తుందనే అడ్డుపుల్లలు వేస్తున్నారు**

**అనుమతులు తీసుకుని వస్తే గండపెండేరం తొడుగుతా**

**కాళేశ్వరంతో లింక్ ఉన్న ముగ్గురు అనుమానాస్పద మృతి**

**కెటిఆర్ వీటిపై ఎందుకు స్పందించడం లేదు**

**ఎఎల్‌బిసి సొరంగం వద్ద సహాయక చర్యలు ముమ్మరం**

**మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** హైదరాబాద్ మెట్రో విస్తరణ అంశం కేంద్ర కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు ఆరోపించారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ అంశాలపై స్పందించారు. ప్రధానితో భేటీ సందర్భంగా 5 ప్రధాన అంశాలపై విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్ కమ్ రైలు ప్రాజెక్టు, డ్రైపోర్టు, రక్షణరంగ ప్రాజెక్టులకు సహకరించాలని కోరినట్టు తెలిపారు. 'కాళేశ్వరంపై పిటిషన్ వేసిన రాజలింగమూర్తి హత్యకు గురయ్యారు. కేసు వాదించిన సంజీవరెడ్డి అనుమానాస్పదంగా మృతి చెందారు. కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ దుబాయ్‌లో అనుమానాస్పదంగా చనిపోయారు. ర్యాడిసన్ బ్లూ డ్రగ్స్ కేసులో కేదార్ కీలక నిందితుడు. ఈ అనుమానాస్పద మరణాలపై కేటీఆర్ ఎందుకు స్పందించట్లేదని ప్రశ్నించారు. జ్యుడిషియల్ విచారణ ఎందుకు కోరట్లేదు. కాళేశ్వరం సహా ప్రాజెక్టుల అక్రమాలపై సాంకేతిక నివేదికలు రాకుండా ప్రస్తుతం ఏమీ మాట్లాడను. ఫోన్ ట్యాపింగ్ కేసులో విదేశాల్లో ఉన్న వారిని తీసురావాల్సిన బాధ్యత ఎవరిది? త్వరలో డ్రగ్స్ కేసు విచారణకు రాబోతోంది. రాష్ట్ర విజ్ఞప్తులు ఐదింటికి కేంద్ర కేబినెట్ ఆమోదం అవసరం. కేబినెట్ ఆమోదం తేవాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డి, సంజయ్‌లదే. మెట్రో విస్తరణ కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. కేంద్రానికి విజ్ఞప్తి చేసిన ఐదు ప్రాజెక్టులు సాధిస్తే కిషన్‌రెడ్డికి గండపెండేరం తొడుగుతానని అన్నారు. పదేళ్లుగా ఎస్ఎల్‌బీసీ పనులు జరగలేదు. కాంగ్రెస్‌కు పేరొస్తుందనే కేసీఆర్ ఎస్ఎల్‌బీసీ పనులు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే పనులు మళ్లీ మొదలయ్యాయి. సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు యత్నిస్తున్నాం. ప్రస్తుతం ఎస్ఎల్‌బీసీ వద్ద 11 సంస్థలు పనిచేస్తున్నాయి. సొరంగం వద్ద జరిగింది ప్రమాదం. కాళేశ్వరంలో జరిగింది డిజైన్, నిర్మాణ లోపంతో జరిగిన దుర్ఘటన. హైదరాబాద్‌కు మెట్రో రావడానికి ప్రధాన కారకుడు జైపాల్‌రెడ్డి. కేసీఆర్ వచ్చాక మెట్రో కోసం చేసిందేమీ లేదు. మెట్రో విస్తరణపై కేసీఆర్ పదేళ్లు తాత్సారం చేశారని మండిపడ్డారు. ప్రతి నెలా ఒకటో తేదీకి రూ.22,500 కోట్లు అవసరం. ప్రస్తుతం ఆదాయం రూ.18,500 కోట్లు మాత్రమే ఉంది. జీతాలకు రూ.6,500 కోట్లు, వడ్డీలకు రూ.6,800 కోట్లు చెల్లిస్తున్నాం. ఆదాయం రూ.22వేల కోట్లకు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం వివరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ సెలగంశెట్టి మృతిపై అనుమానాలున్నాయని, దుబాయ్ లో ఉన్న ఆ మాజీ ఎమ్మెల్యే ఎవరో తేలాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మృతిపై కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కేదార్ మరణంతో లింకు ఉన్న డ్రగ్స్ కేసును బయటికి తీసి విచారణ చేస్తామని సీఎం చెప్పారు. త్వరలోనే కేదార్ మృతదేహం ఇండియాకు రానుందని అన్నారు. రాష్ట్రంలో ఇటీవల మూడు అనుమానస్పద మరణాలు సంభవించాయని చెప్పారు. డ్రగ్స్ కేసుతో సంబంధం ఉన్న కేదార్, కాళేశ్వరం కేసులు వాదిస్తున్న అడ్వొకేట్ సంజీవ రెడ్డి, కేసు వేసిన రాజలింగమూర్తి మృతి చెందారని, వాటిపై కేటీఆర్ న్యాయవిచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ బీజేపీ గెలుపుకోసం పనిచేస్తోందని అన్నారు. సిబీఐ కేసులు అడ్డం పెట్టుకొని బీఅరెస్ ను విలీనం చేసుకోవాలని ఆలోచనలో బీజేపీ ఉందని సీఎం చెప్పారు. ఫార్ములా ఈ, గొర్రెల పంపిణీ కేసులో కేసులో ఈడీ ఇన్వాల్వ్ అయిందని, ఎందుకు చర్యలు తీసుకోలేదని సీఎం ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు మానిటరింగ్ చేస్తోందని, విదేశాల్లో ఉన్న వారిని తీసుకు రావాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీఎం అన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న వారు కూడా అవగాహన లేకుండా మాట్లాడితే ఎలా.? అని అన్నారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్ల పై కమిషన్ విచారణ సాగుతోందని చెప్పారు. రాత్రిరాత్రికి తాము ఎవరినీ అరెస్ట్ చేయబోమని, అది తమ విధానం కాదని సీఎం చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ కమిషన్లు రావనే ఎస్ఎల్బీసీ పనులను పక్కన పెట్టారని సీఎం అన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎస్ఎల్బీసీని 100శాతం పూర్తిచేసి తీరుతామని చెప్పారు. పెరిగిన అంచనాలతో కలిపి 5000 కోట్ల లోపే ఎస్ఎల్బీసీ పూర్తవుతుందని, దీని ద్వారా మూడున్నర లక్షల ఎకరాలకు నీరందుతుందని చెప్పారు. తాను ప్రధాన మంత్రికి ఐదు విజ్ఞప్తులు చేసి, వినతిపత్రాలు అందించానని, వాటికి నిధులు తీసుకొస్తే బహిరంగ సభ ఏర్పాటు చేసి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కి సన్మానం చేస్తానని సీఎం చెప్పారు. ఆ క్రెడిట్ కూడా వాళ్లే తీసుకోవచ్చిన చెప్పారు. తన పాలన అద్భుతంగా ఉందని, ఎవరి ఫోన్లు వారే వింటున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వాళ్లు స్వేచ్ఛగా మాట్లాడుకోగలుగుతున్నారని చెప్పారు. తన కేబినెట్ లో అనుభవజ్ఞులైన మంత్రులు ఉన్నారని, వారి శాఖలను వారే సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. కేంద్రానికి ఎంత మొత్తంలో పన్నులు కడుతున్నామో రాష్ట్రాలకు అంతే వాటా రావాలని అన్నారు. ఉప ఎన్నికలు వస్తాయని కేటీఆర్ చెబుతున్నారని, ఎలా వస్తాయో తనకు అర్థం కావడం లేదని సీఎం అన్నారు. 2014 నుంచి 2014 వరకు( బీఆర్ఎస్ ప్రభుత్వం) ఉన్న శాసన వ్యవస్థే ఇప్పుడు కూడా ఉందని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్ట్ నర్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. మెట్రో విస్తరణ జరిగితే తనకు పేరొస్తుందని అనుకుంటున్నారని చెప్పారు. అందుకే కేసీఆర్ హయాంలో జరగలేదు కాబట్టి ఇప్పుడు కూడా జరగొద్దని భావిస్తున్నారని అన్నారు. అందుకే కేంద్ర కేబినెట్ లో మెట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని చెప్పారు.

# మెట్రో ఫేజ్-2కు అనుమతి ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి

ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్ఆర్ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి తెలియజేశారు. ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని పీఎం మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో అనుసంధానత సులభమవుతుందని ప్రధానమంత్రి మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.. రీజినల్ రింగ్ రైలుకు అనుమతి ఇవ్వాలని పీఎంను సీఎం కోరారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజినల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరమని, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్ట్ లను కలిపేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు తో పాటు రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉందని... రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని.. అంత ప్రాధాన్యం ఉన్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూ ఘాట్ అభివృద్ధి, మూసీ ప్రక్షాళనకు 27 ఎస్టీపీల నిర్మాణం,



మూసీ రిటైనింగ్ వాల్స్, కరకట్టల నిర్మాణం, మూసీ గోదావరి నదుల అనసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ కు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని పీఎంకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ కేడర్ పోస్టులు వచ్చాయని, 2015లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని పీఎం మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నారు.

# శైవక్షేత్రాల్లో భక్తుల సందడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** మహా శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలు శివనామస్మరణలతో మార్మోగుతున్నాయి. శివుడిని దర్శించుకునేందుకు తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శివరాత్రి సందర్భంగా పూజలు నిర్వహించారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాళేశ్వరం, వేములవాడ, కీసర తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేములవాడ రాజన్న క్షేత్రం భక్తుల శివనామస్మరణతో మార్మోగిపోతోంది. భక్తులు స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి.. దర్శనానికి క్యూ లైన్లో బారులు తీరారు. స్వామివారి దర్శనానికి ఆరు గంటల సమయం పడుతోంది. ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి అద్దాల మండపంలో అనువంశిక అర్చకులచే మహాలింగార్చన కార్యక్రమం ఉంటుంది. రాత్రి లింగోద్భవ సమయంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం జరగనుంది. కాళేశ్వరం క్షేత్రంలో మహాశివరాత్రి శోభ కనిపిస్తోంది. తెలంగాణతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుండి భక్తులు కాళేశ్వరంకు తరలివస్తున్నారు. త్రివేణి సంగమ గోదావరి నదిలో భక్తుల పుణ్యస్నానాలు ఆచరించి.. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి మారేడు దళాలు సమర్పించి.. అభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తున్నారు.



సాయంత్రం 4.35కు వైభవంగా శ్రీ శుభానంద ముక్తీశ్వర స్వామి కల్యాణోత్సవం జరగనుంది. రాత్రి 12కు లింగోద్భవ పూజ జరగనుంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మహా శివరాత్రి పర్వదినం కావడంతో శ్రీశైలంకు భారీగా భక్తులు తరలివస్తున్నారు. సాయంకాలం శ్రీస్వామి అమ్మవార్లకు నంది వాహనసేవ, ఆలయ ఉత్సవం ఉంటుంది. రాత్రి 10 గంటలకు లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీస్వామివారికి పాగలంకరణ.. రాత్రి 12 గంటలకు పార్వతి పరమేశ్వరుల మహాశివరాత్రి బ్రహ్మోత్సవ కళ్యాణం జరగనుంది. మహానంది క్షేత్రంలో నేడు రాత్రి 10 గంటలకు లింగోద్భవ సమయంలో మహా రుద్రాభిషేకం, స్వామివారి కళ్యాణోత్సవం జరగనుంది.

# రెండ్రోజుల్లో ఆపరేషన్ పూర్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సొరంగమార్గంలో చిక్కుకున్న 8 మందిని కాపాడేందుకు .. రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రమాద స్థలికి చేరుకునేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నట్టు



వివరించారు. దేశ సరిహద్దుల్లో టన్నెల్స్ నిర్మించే నిపుణులు, ఎక్కడ టన్నెల్ ప్రమాదం జరిగినా సహాయక చర్యల్లో పాల్గొన్న ఎక్స్‌పర్ట్స్‌ను తీసుకొచ్చి వారి సాయం తీసుకుంటున్నామని తెలిపారు. 'సహాయక చర్యలు మరింత వేగవంతం చేస్తున్నాం. గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి దెబ్బతిన్న టీబీఎంను వేరు చేస్తాం. ఎస్ఎల్‌బీసీ పూడికలోకి వెళ్లాలని నిర్ణయించాం. మట్టి, నీరుతో పేరుకుపోయిన సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలని నిర్ణయించాం. ప్రకృతి విపత్తునను రాజకీయం చేసి లబ్ధిపొందాలనుకునే వారి గురించి నేను మాట్లాడదల్చుకోలేదు. దేశ.. విదేశాల్లో ఉన్న టన్నెల్ ఎక్స్‌పర్ట్స్ సూచనలతో ముందుకెళ్తున్నాం. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని కాపాడటమే మా లక్ష్యం అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## ఎక్స్‌పర్ట్స్‌తో సూచనలతో ముందుకెళ్తున్నాం

సహాయక చర్యలు మరింత వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. గ్యాస్ కట్టర్ తో కట్ చేసి దెబ్బతిన్న టీబీఎంను వేరు చేస్తామని, ఎస్ఎల్‌బీసీ పూడికలోకి వెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. మట్టి, నీరుతో పేరుకుపోయిన స్టిల్‌ను పూర్తిగా తొలగించాలని నిర్ణయించారు. ప్రకృతి విపత్తును రాజకీయం చేసి లబ్ధిపొందాలి అనుకునే వారికోసం తను మాట్లాడుకోవాలని అనుకోవడం లేదన్నారు. దేశ, విదేశాల్లో ఉన్న టన్నెల్ ఎక్స్‌పర్ట్స్ తో సూచనలతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు.

## ఐదు రోజులుగా కొనసాగుతున్న రెస్క్యూ పనులు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 26:** టన్నెల్‌లో చిక్కుకున్న 8మందిని కాపాడేందుకు ఎన్నో ప్రయత్నాలు సాగుతున్నాయి. షిఫ్టుకి వందమందికి పైగా పనిచేస్తున్నారు. నాలుగు రోజులుగా నిరంతరాయంగా పనులు కొనసాగుతున్నాయి. అందర్నీ సజీవంగా తీసుకొచ్చేందుకు 11 సంస్థలు శ్రమిస్తున్నాయి. గంటలు గడుస్తున్న కొద్దీ టెన్షన్ పెరిగిపోతున్న నేపథ్యంలో.. వీలైనంత త్వరగా లోపలికి చేరుకునేందుకు యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా రెస్క్యూ సిబ్బందికి టీబీఎం చాలెంజింగ్‌గా మారింది. ప్రమాదం జరిగిన దగ్గర టీబీఎం ముక్కలై దాని విడిభాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో అక్కడ రెస్క్యూ చేయాలంటే చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఓవైపు బురద, ఇంకోవైపు సీపేజ్ వాటర్, మరోవైపు టీబీఎం ముక్కలతో అత్యంత ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. గ్యాస్ కట్టర్లను ఉపయోగించి తీసేసే ప్రక్రియను జరపాలన్నా.. ఉబికి వస్తున్న నీరు ప్రతిబంధకంగా మారింది. ఇక రెస్క్యూ ఆపరేషన్లో ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీ పాలుపంచుకుంటున్నాయి. జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ర్యాట్ హోల్ మైనర్స్, సింగరేణి, హైడ్రా టన్నెల్ ఎక్స్‌పర్ట్స్ మరికొన్ని కంపెనీలు తమ సేవలను అందిస్తున్నాయి. మొత్తం 11 ఏజెన్సీలు నిరంతరం కోఆర్డినేషన్ చేసుకుంటూ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 :** శంషాబాద్ విమానాశ్రయంలో సరైన సమయానికి గమ్యస్థానాలకు చేర్చాల్సిన విమానాలు ఇలా ఆలస్యం అవడం పట్ల ప్యాసింజర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా.. మరోసారి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ప్రయాగ్‌రాజ్ వెళ్ళాల్సిన స్పైస్‌జెట్ విమానం ఆలస్యం అవడమే ఇందుకు కారణం. స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో మూడు గంటలుగా విమానం కోసం ప్రయాణికులు ఎదురుచూపులు చూస్తున్న పరిస్థితి. మూడు గంటలు అవుతున్నప్పటికీ విమానం ఇంకా బయలుదేరకపోవడంపై ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ముఖ్యంగా ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన ప్రయాణికులు విమానం ఆలస్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్పైస్ జెట్‌లో సాంకేతిలోపం తలెత్తిన నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సిబ్బంది ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై ప్రయాగ్రాజ్ వెళ్లే ప్రయాణికులు మండిపడుతున్నారు. కాగా.. ఇదే నెలలోనే ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానం ఐదున్నర గంటల పాటు ఆలస్యంగా నడిచిన విషయం తెలిసిందే. ఈనెల 7న హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన విమానం ఆలస్యం అవడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఉదయం 10:30 గంటలకు బయలుదేరాల్సిన దాదాపు ఐదున్నర గంటలు ఆలస్యమైంది. ఐదు గంటల పాటు విమానాశ్రయంలో ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రయాణికుల్లో హీరో విజయదేవరకొండతో పలువరు సినీ ప్రముఖులు ఉన్నారు. అలాగే ఇద్దరు ఐఏఎస్‌లు, ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులు కూడా ఉన్నారు. అయితే కనీస సమాచారం ఇవ్వకుండా గంటల తరబడి వెయిట్ చేయించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు రోజు కూడా టేకాఫ్ తీసుకునేందుకు రన్‌వే వెళ్లిన విమానం ఇంజిన్ మొరాయించడంతో నిలిచిపోయింది. గుహవాటి వెళ్లాల్సిన ఇండియర్ ఎయిర్‌లైన్స్ విమానం రన్‌వే పైకి వచ్చి టేకాఫ్ అవుతున్న సమయంలో ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని గమనించిన పైలెట్ వెంటనే ఏటీసీ అధికారులు సమాచారం ఇచ్చారు. వెంటనే ఇంజనీరింగ్ నిపుణులు అక్కడకు చేరుకుని దాదాపు గంట పాటు శ్రమించి లోపాన్ని సరిచేశారు. ఆ తరువాత విమానం గుహవాటికి బయలుదేరి వెళ్లింది. అయితే రన్‌వేకు పైకి వెళ్లిన విమానం తిరిగి పార్కింగ్ బే వైపు రావడంతో ప్రయాణికులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. అయితే తిరిగి గంటన్నర ఆలస్యంగా విమానం బయలుదేరడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



# ఫార్మసీరంగంలో హైదరాబాద్ ముందంజ



- లైఫ్‌సైన్సెస్, ఫార్మాసూటికల్స్, హెల్త్‌కేర్ రంగాల్లో..
- డ్రగ్స్ ఫార్మాసూటికల్స్ ఉత్పత్తిలో మూడో స్థానంలో భారత్
- బయో ఏషియా సదస్సు ముగింపు కార్యక్రమంలో కిషన్ రెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి 26:** హైదరాబాద్ ముత్యాల నగరంగానే కాకుండా, ప్రపంచ ఫార్మసీగా, అంతర్జాతీయ స్థాయి ఆస్పత్రులు హబ్‌గా ఖ్యాతికెక్కిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 22వ ఎడిషన్ బయో ఆసియా–2025 లాంటి గ్లోబల్ ఈవెంట్స్ నగర వేదికగా జరగడం, హెల్త్‌కేర్ రంగంలోని సాంకేతికత, సుస్థిరమైన పద్ధతుల గురించి చర్చించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. బుధవారం బయో ఏషియా–2025 సదస్సు ముగింపు కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో వినూత్నమైన ఆవిష్కర్తలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. లైఫ్‌సైన్సెస్, ఫార్మాసూటికల్స్, హెల్త్‌కేర్ రంగాల్లో భారతదేశం విశేషమైన పురోగతి సాధిస్తోందని చెప్పారు. డ్రగ్స్, ఫార్మాసూటికల్స్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు మందులు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ప్రపంచ అవసరాల్లో 60 శాతానికి పైగా వ్యాక్సిన్లు, 20 శాతం జెనరిక్ మందులను భారత్ నుంచే సరఫరా చేస్తున్నామని చెప్పారు. పదేళ్లలో భారత ఫార్మా ఉత్పత్తుల ఎగుమతుల విలువ దాదాపు రెట్టింపు అయిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలో వస్తున్న ఆర్థిక సంస్కరణల కారణంగా.. భారతదేశం ఇటీవలే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. భారత్ ఫార్మా రంగంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. దేశంలోని ఫార్మా ఆదాయంలో 35 శాతం, బల్క్ డ్రగ్స్ లో 40 శాతం ఆదాయం భాగ్యనగరం నుంచే వస్తోంది. 800 ఫార్మా, బయోటెక్, మెడిటెక్ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఐఐటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ (నైపర్), సీసీఎంబీ, ఐఎస్‌బీ, నల్సార్, డీఆర్‌డీవో వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి టాలెంటెడ్ యువకులు ఆయా రంగాల్లో సత్తాచాటేందుకు సిద్ధంగా ఉన్నారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, ఫార్మాసిటీ, మెడికల్ డివైజెస్ పార్కు వంటివి విదేశీ పెట్టుబడు లను ఆకర్షించి, 2047 నాటికి 500 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఎకానమీ సృష్టి దిశగా అడుగులు వేసే అవకాశాలు హైదరాబాద్‌లో మెండుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం లైఫ్ సైన్సెస్ రంగానికి ఊతమిచ్చేం దుకు ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'మెడ్‌టెక్ మిత్ర' వంటి వేదికలు.. ఆవిష్కర్తలకు, స్టార్టప్స్, భాగస్వామ్యపక్షాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు దోహదపడుతున్నాయని చెప్పారు. గ్లోబల్ హెల్త్‌కేర్ రంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ పెట్టుబడిదారులు, ఇన్నొవేటర్లు, శాస్త్రవేత్తలు భారత్‌తో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలి. మనమంతా కలిసి హెల్త్‌కేర్ రంగాన్ని మరింతగా తీర్చిదిద్దుదామని కిషన్‌రెడ్డి తెలిపారు.



## పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటాం

### మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్:** బయో ఏషియా–2025 సదస్సుకు తాము ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన వచ్చిందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం బయో ఏషియా సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. "బయో ఏషియా చరిత్రలో ఈ ఏడాది సదస్సు ఒక మైలు రాయిగా నిలుస్తుంది. దేశ, విదేశాల నుంచి 4వేల మంది ఫార్మా, హెల్త్ కేర్ ఇండస్ట్రీ లీడర్స్, పాలసీ మేకర్స్, ఆవిష్కర్తలు హాజరయ్యారు. హెల్త్, ఫార్మా రంగాలకు చెందిన 100 మంది నిపుణులు ఆయా రంగాల్లో నెలకొన్న సవాళ్లను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సదస్సులో 200కు పైగా బీ టూ బీ (బిజినెస్ టూ బిజినెస్) మీటింగ్స్ జరిగాయి. గతేడాది కంటే ఈసారి ఎక్కువ పెట్టుబడులు వచ్చాయి. అమెరికాకు చెందిన బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ 'ఆమ్జెన్' మన దగ్గర భారీగా పెట్టుబడి పెట్టింది. ఈ సంస్థ వల్ల సుమారు మూడు వేల మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ఏడాది సదస్సుకు దేశ భవిష్యత్తును మార్చే సత్తా ఉన్న ప్రతిభ గల యువ ఆవిష్కర్తలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. వారి ఆలోచనల్లో నుంచి పుట్టుకొచ్చిన ఈ ఆవిష్కరణలు ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తాయి. మొత్తం 84 స్టార్టప్స్ సదస్సులో పాల్గొన్నాయి. ఆవిష్కరణలకు అండగా ఉండేందుకు, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు, పరిశ్రమలతో కలిసి పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. తెలంగాణను నాణ్యమైన మానవ వనరులకు హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటాం. మీతో పాటు కలిసి నడుస్తాం. ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటాం. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని బయో ఏషియా–2025 వేదికగా పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేస్తున్నా" అని శ్రీధర్‌బాబు తెలిపారు.

## రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లూ ఢిల్లీకి వెళ్లినా ఒరిగేదేమీ లేదు : కేటీఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 :** సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లూ ఢిల్లీ టూర్‌కు వెళ్లిన తెలంగాణకు ఒరిగేదేమీ లేదని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. 36 సార్లు ఢిల్లీకి పోయినా మూడు రూపాయలు తెచ్చింది లేదని విమర్శించారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం కూలి 8 మంది కార్మికులు చిక్కుకుంటే.. ఎన్నికల ప్రచారంలో మునిగి తేలావని మండిపడ్డారు. మూడు నెలలుగా జీతాల్లేక అల్లాడుతున్నామని కార్మికులు వాపోతుంటే ఎన్నికల ప్రచారం ముగించుకుని నిమ్మలంగా మళ్లీ హస్తిన బాటపట్టావని అన్నారు. సొరంగంలో సహాయక చర్యలు ఒక్కడుగు ముందుకు.. వందడుగులు వెనక్కి అన్నట్లుగా ఉందని కేటీఆర్ విమర్శించారు. అక్కడ ఆక్సిజన్ లేదు.. కన్వేయర్ బెల్టు తెగిపోయిందని తెలిపారు. 96 గంటలు దాటినా ఒక్కడుగూ ముందుకు పడటం లేదని తెలిపారు. కాళేశ్వరం పర్రెల మీద శ్రీశైలం అగ్నిప్రమాదం మీద కారు కూతలు కూసి, విషపు రాతలు రాసిన మేధావుల నోళ్లు ఎస్‌ఎల్‌బీసీ విషయంలో మాత్రం నోరెత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హస్తిన యాత్రలు మాని.. ఆ కార్మికుల గోడు వినాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. ఆ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబాలకు ధైర్యాన్ని ఇవ్వాలని అన్నారు. అక్కడ చిక్కుకున్నవి సాధారణ ప్రాణాలు కాదు .. ఈ జాతి సంపద అని స్పష్టం చేశారు.

## స్టాలిన్‌కు కేటీఆర్ మద్దతు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 :** నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్థించారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్థించారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారత దేశానికి అన్యాయం జరుగుతుందన్న వ్యాఖ్యలకు మద్దతిచ్చారు. దేశానికి అత్యవసరమైనప్పుడు కుటుంబ్ర నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడం తగదని అన్నారు. దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్రను పరిగణనలోకి తీసుకోకుండా నియోజకవర్గాల పునర్విభజన చేయడం ప్రజాస్వామ్య, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని కేటీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిజంగానే నియోజకవర్గాల పునర్విభన చేయాలని భావిస్తే.. అది దేశానికి అందించే ఆర్థిక సహకారం వాటా ఆధారంగా ఉండాలని ప్రతిపాదించారు. దేశ నిర్మాణానికి తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాలు చేస్తున్న కృషిని ఎవరూ విస్మరించలేరని అన్నారు. దేశ జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.8 శాతం మాత్రమే ఉందని.. కానీ దేశ జీడీపీలో మాత్రం 5.2 శాతం కంటే ఎక్కువ వాటా అందిస్తోందని పేర్కొన్నారు.

# ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు

- మొత్తం 18,180 మందికి రూ. 6వేల చొప్పున జమ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 : తెలంగాణలో ఉపాధి కూలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను విడుదల చేసింది ప్రభుత్వం. ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నిధులు జమ అయ్యాయి. జనవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి మండలంలోని ఒక పైలెట్ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి కూలీల ఖాతాల్లో ప్రభుత్వం నిధులను జమ చేసింది. మొత్తం 18,180 మందికి 6 వేల చొప్పున జమ అయ్యాయి. అయితే ఆ తర్వాత మండలి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిలిచిపోయింది. కానీ.. ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. మంత్రి వినతిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు



ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ రెండు జిల్లాల్లో 66,240 మంది ఉపాధి కూలీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించింది సర్కార్. 66,640 మంది కూలీల ఖాతాల్లో రూ.39.74 కోట్లు జమ అయ్యాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 83,420 మంది ఉపాధి కూలీలకు రూ.50.65 కోట్లను తెలంగాణ ప్రభుత్వం చెల్లించింది. ఎన్నికల కోడ్ ముగియగానే లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించనుంది సర్కార్. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రెక్కల కష్టాన్ని నమ్ముకున్న ఉపాధి కూలీలకు పెద్దదిక్కుగా తెలంగాణ ప్రభుత్వం నిలుస్తోంది. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఉపాధి కూలీలకు ఆర్థిక చేయుత కల్పిస్తూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఒక సీజన్‌కు 6000 రూపాయలు చొప్పున కూలీలకు భరోసా కల్పిస్తోంది. డీబీటీ పద్ధతిలో ఉపాధి కూలీల ఖాతాల్లోకి నేరుగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను ప్రభుత్వం జమ చేస్తోంది.

## ఉద్దేశపూర్వకంగానే ఏపీ అధికారుల డుమ్మా



**హైదరాబాద్,ఫిబ్రవరి 26:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో హైదరాబాద్‌లోని జలసౌధలో కేఆర్ఎంబీ సమావేశం జరిగింది. భేటీలో తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ పాల్గొన్నారు. ఈ సమావేశానికి కూడా ఏపీ నుంచి అధికారులు హాజరుకాకపోవడంతో గురువారం మరోమారు సమావేశం కావాలని నిర్ణయించారు. ఏపీ అధికారులు హాజరుకాకపోవడంపై రాహుల్ బొజ్జా అసంతృప్తి వ్యక్తం చేశారు. బోర్డు సమావేశం ఏర్పాట్లు చేస్తే.. ఉద్దేశపూర్వకంగానే ఏపీ అధికారులు రాలేదని పేర్కొన్నారు. తన వాదనలు రికార్డు చేసి కేంద్రానికి పంపాలని కోరారు. శ్రీశైలం, సాగర్ నుంచి మే వరకు తమకు 55 టీఎంసీల నీరు కావాలని ఇప్పటికే ఏపీ సర్కారు ప్రతిపాదించింది. శ్రీశైలం, సాగర్ నుంచి మే వరకు తమకు 63 టీఎంసీల నీరు కావాలని తెలంగాణ కోరింది.

# నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు

### ఏడు ఉమ్మడి జిల్లాల్లో పోలింగ్ ఏర్పాట్లు

హైదరాబాద్,ఫిబ్రవరి26 : తెలంగాణలో గ్రాడ్యుయేట్, టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఈ ఎన్నికలు జరుగతనున్నాయి. 7 ఉమ్మడి జిల్లాల్లో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది ఎన్నికల సంఘం. ఈ క్రమంలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు ఇలా త్రిపాఠి. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పాత 3 జిల్లాలు, కొత్తగా ఏర్పడ్డ 12 జిల్లాల అధికారుల కోఆర్డినేషన్ బాగుందని.. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తామని అన్నారు. సుమారు రెండు వేల మంది సిబ్బందితో ఎన్నికలు నిర్వహణ జరుగుతుందని అన్నారు త్రిపాఠి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉండగా.. 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ క్యామ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తామని అన్నారు. దాదాపు 1100 మందిని ఎన్నికల నిర్వహణ కోసం కేవలం పోలింగ్ కేంద్రాల్లోనే ఏర్పాటు చేశామని అన్నారు. విద్యావంతులైన ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు త్రిపాఠి. ఇలా త్రిపాఠితో పాటు పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. దాదాపు వేయి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు



బస్సుల్లో వెళ్లేటప్పటి నుంచి తిరిగి రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే వరకు పోలీసుల భద్రత ఉంటుందని అన్నారు. వాహనం వెంట సెక్యూరిటీ కూడా నల్లగొండ జిల్లా పోలీసులే ఉంటారని.. బయటి జిల్లాల నుంచి బ్యాలెట్ పేపర్లను తరలించేటప్పుడు జిపిఎస్ సిస్టం పరిశీలిస్తూ సెక్యూరిటీ ద్వారా తీసుకొస్తామని తెలిపారు. పోలింగ్ అనంతరం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు సంబంధించిన అన్ని బ్యాలెట్ బాక్సులను నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌కు తీసుకొస్తామని.. ఆ తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన స్టాం÷–రగ్ రూమ్‌ల్లో పొలిటికల్ ప్రజాప్రతినిధుల సమక్షంలో భద్రపరుస్తామని అన్నారు. స్టాం÷–రగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని అన్నారు ఎస్పీ శరత్ చంద్ర పవార్.

## దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం

### సుప్రీంలో కేసుపై స్పందించిన కేంద్రం

### అది ఆమోదయోగ్యం కాదన్న కేంద్రం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** వివిధ కేసుల్లో దోషులుగా తేలిన నేతలపై జీవిత కాల నిషేధాన్ని విధించాలన్న అభ్యర్థను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కేసులో సదరు వ్యక్తిపై ఆరేళ్ల పాటు నిషేధం విధిస్తే సరిపోతుందని తెలిపింది. ఓ వ్యక్తిపై జీవిత కాల నిషేధం అనేది కఠినతరమని పేర్కొంది. అయితే రాజకీయ నేతలపై జీవిత కాల నిషేధం ఎన్నేళ్లు అనే దానిపై నిర్ణయాధికారం పార్లమెంట్‌దేనని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఖరాకండిగా తేల్చి చెప్పింది. దోషులుగా రుజువు అయితే జీవితకాల నిషేధాన్ని విధించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై కేంద్రం తన అభిప్రాయాన్ని వివరిస్తూ.. సుప్రీంకోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం విధించాలంటూ న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈ నేపథ్యంలో దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు కోరింది. ఆ క్రమంలో సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం తాజాగా తన అభిప్రాయాన్ని వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది.

## మహిళపై అత్యాచారం

### పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఘోరం



**పుణె,ఫిబ్రవరి26 :** పూణేలో దారుణం చోటు చేసుకుంది. రద్దీగా ఉండే స్వర్గేట్ బస్టాండ్‌లో, పోలీస్ స్టేషన్‌కి కూతవేటు దూరంలో మహిళపై అత్యాచారం జరగడం సంచలనంగా మారింది. నిందితుడిని దత్తాత్రేయ రాందాస్‌గా గుర్తించారు. పోలీస్ స్టేషన్‌కి 100 మీటర్ల దూరంలో, నిలిచి ఉన్న బస్సులో మంగళవారం 26 ఏళ్ల మహిళపై అత్యాచారం జరిగింది. సీసీటీవీ కెమెరాల్లో నిందితుడిని గుర్తించారు. నిందితుడిని పట్టుకునేందుకు 8 పోలీస్ టీంలను ఏర్పాటు చేశారు. స్నిఫర్ డాగ్స్‌ని రంగంలోకి దించారు. నిందితుడు 36 ఏళ్ల రాందాస్‌కి గతంలో నేరచరిత్ర ఉన్నట్లు గుర్తించారు. సతారా జిల్లాలోని ఫల్తాన్ అనే గ్రామానికి చెందిన మహిళ, పనిమనిషిగా పనిచేస్తుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నేరం ఉదయం 5.45 నుంచి 6.30 గంటల మధ్య జరిగినట్లు చెబుతున్నారు. సీసీటీవీ ఫుటేజీలో మహిళతో ముందుగా నిందితుడు మాట్లాడుతున్నట్లు కనిపించింది. ఆమె గమ్యస్థానాన్ని తెలుసుకున్న నిందితుడు, ఆగి ఉన్న బస్సు వెళ్తుందని అందులోకి వెళ్లాలని సూచించినట్లు బాధితురాలు తెలిపింది. లైట్లు లేకపోవడంతో సందేహించానని, అయితే ప్రయాణికులు నిద్ర పోతుండటంతో లైట్లు ఆర్పేశానని నిందితుడు చెప్పాడని ఆమె తెలిపింది. బస్సులోకి వెళ్లగానే, నిందితుడు డోర్లు మూసేసి తనపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. జరిగిన విషయాన్ని, తన స్నేహితురాలికి తెలపడంతో పోలీసుల ఫిర్యాదు చేశారు. ఈ బస్ స్టాండ్ మహారాష్ట్ర ఆర్టీసీ నడిపే అతిపెద్ద బస్ స్టాండ్లలో ఒకటి. మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ హర్షవర్ధన్ సప్కల్ మాట్లాడుతూ..రాష్ట్రంలో అత్యాచారాలు పెరిగాయని, తాజాగా ఘటన 2012 ఢిల్లీ నిర్భయ ఘటనను గుర్తుకు తెస్తోందని విమర్శించారు. నేరాలకు అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఎన్సీపీ నేత సుప్రియా సూలే ఆరోపించారు.



# మోడీ ద్వయం ఏమి చేయబోతున్నది?

ప్రధాని మోడీ, అమిత్‌షాలు నిశ్శబ్దంగా ఉన్నారంటే ఎవరికో మూడినట్లే. వారు ఏదైనా అలజడి సృష్టించే ముందు ప్రశాంతంగా ఉంటారు. ఎవ్వరికీ అంతుచక్కకుండా ఉంటారు. వారి వ్యూహాలను పసిగట్టడం వారితో ఉన్నా వారికి కూడా తెలియదు. కాంగ్రెస్ ముక్తభారత్ నినాదంతో రాజకీయాలు నెరిపిన మోడీ కొంతవరకు విజయం సాధించారు. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు పార్లమెంటులో ప్రతిపక్ష హోదా లేకుండా చేశారు. అయితే ఇదొక్కటే చేయడం వల్ల ప్రజలు హర్షించరు..గుర్తించరని వారు గమనించలేక పోయారు. అందుకే గత ఎన్నికల్లో కాంగ్రెస్ వందసీట్లు గెల్చుకుని ప్రధాన ప్రతిపక్షంగా పార్లమెంటులో అడుగుపెట్టింది. ఆ పార్టీ కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. వయనాడ్‌తో పాటు రాయబరేలీలో కూడ రాహుల్ గెలిచి, వయనాడ్‌లో చెల్లెలు ప్రియాంకను మెల్లంగా లోక్‌సభ గడప తొక్కేలా చేశారు. అంతకుముందే తల్లి సోనియా రాజ్యసభలో చేరారు. మొత్తంగా కుటుంబం అంతా పార్లమెంటులో ఉన్నారు. ఇక మిగిలింది రాబర్ట్ వాద్రా మాత్రమే. ఆయన కూడా కర్నాటక లేదా తెలంగాన నుంచి రాజ్యసభ మెట్లు తొక్కినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. అయితే ఇదంతా కాంగ్రెస్ వైపు కనిపిస్తున్న కోణం. మోడీ కోణం మరోటిగా ఉంది. కేవలం 240 సీట్లకే పరిమితమైన బిజెపి, మొన్నటి ఎన్నికల్లొ పూర్తిస్థాయి మెజార్టీ సాధించలేకపోయింది. ఈ క్రమంలో మళ్లీ కమలం ఆపరేషన్ మొదలవుతుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. తమ కాంగ్రెస్ ముక్త భారత్ వ్యూహంలో భాగంగా మెల్లగా అడుగులు వేసే సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ మరో ఐదేళ్ల వరకు అధికారం కోసం వేచిచూడక తప్పదు. ఈలోగా పార్టీలో ఉన్న వృద్ధనేతలకు అంతకాలం వేచిచూసే ఓపిక ఉండదు. రాజకీయాల్లో ఇప్పుడు తమ వయసురీత్యా కూడా రాజకీయాలు నెరపుతున్నారు. తాజాగా శశిథరూర్ మోడీకి దగ్గరవుతున్నారన్న సంకేతాలు...తుఫాన్‌కు ముందు ప్రశాంతత లాంటివనే చెప్పాలి. అయితే తాను పార్టీ వీడడం లేదని శశిథరూర్ స్పష్టం చేసారు. ప్రతి రాజకీయవేత్త పార్టీ మారు క్రమంలో చేసే సాధారణ ప్రకటన ఇది. అయితే ఒక్క శశిథరూర్ కోసం మోడీ ద్వయం ప్రయత్నించదని గుర్తించాలి. ఆయనతోపాటు మరికొందరి కోసం గాలం వేసివుంటారు. కాంగ్రెస్‌ను చీల్చి చెండాడడానికి సమయం కోసం ఎదురు చూస్తున్నారు. రాహుల్ నాయకత్వం పట్ల విశ్వాసం లేని వారు వీరివలలో పడడం ఖాయం. కేరళలో సొంతంగా ప్రజలలోఇమేజ్‌ను ఆసరా చేసుకొని వరుసగా నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికైన మాజీ కేంద్ర మంత్రి శశిథరూర్ ఇప్పుడు పార్టీలో తిరుగులేని నేతగా వెలుగొందుతున్న రాహుల్ గాంధీపై తిరుగుబాటు ధోరణి ప్రదర్శిస్తున్నారు. వరుసగా హర్యానా,మహారాష్ట్ర, ఢిల్లీలలో ఘోర పరాజయాలు మూటగట్టుకున్న తర్వాత 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్య పార్టీలు అన్ని దూరం అవుతున్న సమయంలో శశిథరూర్ వ్యవహరిస్తున్న తీరు ఆ పార్టీ శ్రేణులను కలవరం పరుస్తున్న మాట నిజం. 2019లో పార్టీ పరాజయం తర్వాత, 2020లో ఐదుగురు మాజీ ముఖ్యమంత్రులు, పలువురు ఎంపిలు, మాజీ కేంద్ర మంత్రులతో కలిసి 23 మంది పార్టీ అధినేత్రికి రాసిన లేఖలో సైతం తిరుగుబాటు ధోరణి ప్రదర్శించారు. ఈ క్రమంలో గులాం నబీ ఆజాద్, కపిల్ సిబల్ లాంటి వారు తమదారి తాము చూసుకున్నారు. ఎందుకంటే కాంగ్రెస్ ఇకముందు సంపూర్ణ మెజార్టీతో తిరిగి అధికారంలోకి వస్తుందని నేతలకు నమ్మకం పోయింది. అందుకే శశిథరూర్ తిరుగుబాటును ఆ విధంగా కొట్టిపారివేయ లేము. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అక్టోబర్, 2022లో జరిగిన ఎన్నికల్లో గాంధీ కుటుంబం బలపరిచిన మల్లికార్జున్ ఖర్గేపై పోటీ చేసి మొత్తం 5000 మంది ఓటర్లలో 1500కు పైగా ఓట్లు సంపాదించడం పార్టీలో విస్తృత ప్రతిపాదికలో థరూర్‌కు గల మద్దతును తెలుపుతున్నది. నిజంగా ఆ నాడు థరూర్‌ను పార్టీ అధ్యక్షునిగా ఎన్నుకొని ఉంటే నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ బలమైన ప్రాతిపదికను ఏర్పరచుకొని ఉండేదని పలువురు భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షునిగా రెండోసారి ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ను కలిసేందుకు ప్రధాని మోడీ ప్రత్యేకంగా అమెరికాకు వెళ్లిన సందర్భంలో రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు తీవ్రమైన విమర్శలు గుప్పిస్తే, శశిథరూర్ మాత్రం ఫలవంతమైన పర్యటన అని పొగడ్తలతో ముంచెత్తారు. అక్రమ వలసదారులు అమానుష రీతిలో పంపడాన్ని మోడీ ప్రస్తావిస్తే బాగుండెడిది అని చురకలు అంటిస్తూనే టారిఫ్‌ల విషయంలో వెంటనే ట్రంప్ కఠిన నిర్ణయం తీసుకోకుండా చర్చల పేరుతో వాయిదా వేయగలిగారని కొనియాడారు. తమ రాజకీయ ప్రత్యర్థులను థరూర్ పొగడ్తలతో ముంచెత్తడం సహజంగానే కాంగ్రెస్ నేతలకు ఆగ్రహం కలిగించింది. విదేశీ పర్యటనలో ఉన్న థరూర్ తో వెంటనే మాట్లాడాలని స్వయంగా రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. ఫిబ్రవరి 18న రాహుల్‌ను కలిసిన థరూర్ తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో తన పాత్ర ఏమిటో ముందు స్పష్టం చేయమని రాహుల్ గాంధీని నిలదీశారు. పార్లమెంట్ చర్చలలో పార్టీ ప్రతినిధిగా తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, పార్టీలో సైతం తనకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ఏ కమిటీలో తనకు అవకాశం ఇవ్వడం లేదని నిలదీశారు. ఈ విషయాలపై ఎటువంటి సమాధానం ఇవ్వలేక రాహుల్ గాంధీ మౌనం వహించినట్లు తెలుస్తున్నది. అంతేకాదు, తాను ఇప్పటికీ పార్టీకి అందుబాటులోనే ఉన్నానని చెబుతూనే తన అవసరం లేదని పార్టీ భావిస్తే తనకూ వేరే మార్గాలు ఉన్నాయని ఆ తర్వాత స్పష్టంగా హెచ్చరించారు. అంటే థరూర్ ధిక్కార ధోరణి మొదలయ్యిందనే చెప్పాలి. ఇక్కడ ఒక్క థరూర్ మాత్రమే మనకు పైకి కనిపిస్తున్నారు. కానీ కాగ్రెస్ పుట్టి ముంచడానికి అనేకులు సిద్దంగా ఉండివుంటారు. కాంగ్రెస్‌కు బీటల వేయడంలో థరూర్ అడుగు వేస్తే మరికొందరు ముందుకు రావచ్చు. మహారాష్ట్ర తరహాలో కాంగ్రెస్ చీలిక అనివార్యం కావచ్చు. మోడీ ద్వయం ప్రశాంతతకు ఇది కారణం కూడా కావచ్చు. రాజకీయాల్లో ఏదైనా జరగవచ్చు. జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతి వంటి సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో తమ పీఠాన్ని బలోపేతం చేసుకునే పనిలో మోడీ ద్వయం ఏమైనా చేసే అవకాశం ఉంది.

# ప్రయాగ్‌రాజ్‌లో నాగసాధువులు

## చివరి రోజు భారీగా వచ్చినట్లు గుర్తింపు


**ప్రయాగరాజ్,ఫిబ్రవరి26:** మహా కుంభమేళా చివరి రోజు కావడంతోభక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 45 రోజుల పాటు జరుగుతున్న ఈ వేడుకకు ఇప్పటివరకు 65 కోట్లమందికిపైగా భక్తులు హాజరయ్యారు. చివరి రోజు మహాశివరాత్రి సందర్భంగా నాగ సాధువులు కాశీ విశ్వనాథ ఆలయం వైపు వెళ్లి శివుడికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందుకు సంబంధించిన దృశ్యాలను డ్రోన్ విజువల్స్ ద్వారా షూట్ చేశారు. ఈ వీడియోలో ఒకేసారి అనేక మంది సాధువులు ఒక్కసారిగా వెళ్లిన దృశ్యం ఆకట్టుకుంటోంది. ఇది ఆధ్యాత్మికంగా కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెప్పవచ్చు. నాగ సాధువులు కుంభమేళా ముగిసిన తర్వాత, తమ ఆధ్యాత్మిక సాధన కొనసాగించడానికి మళ్లీ హిమాలయాలకు తిరిగి వెళతారు. నాగ సాధువులను సాధారణంగా హిందూ సన్యాసులుగా పరిగణించబడతారు. వీరు సాధారణ జీవనం వదిలేసి ఆధ్యాత్మికతను పాటిస్తూ కఠినమైన ధ్యానం, యోగా, ప్రార్థనలను చేస్తారు. అయితే ఈసారి మహా కుంభమేళా ముగుస్తున్న తరుణంలో మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయాలను కూడా ఇక్కడ తెలుసుకుందాం. వచ్చే ఐదేళ్లలో హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్, ప్రయాగ్ రాజ్ ప్రాంతాల్లో కుంభమేళా జరగనుంది. 2027లో హరిద్వార్‌లో అర్ధ కుంభమేళా నిర్వహించనున్నారు. అర్ధ కుంభమేళా అంటే ఆరేళ్లకు ఒకసారి వస్తుంది. పూర్ణ కుంభమేళా ప్రతి 12 ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. చివరి అర్ధ కుంభమేళా 2021లో హరిద్వార్‌లో జరిగింది. ఈ క్రమంలో 2027లో అర్ధ కుంభమేళా నిర్వహించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. మరోవైపు 12 ఏళ్ల తర్వాత వస్తున్న పూర్ణ కుంభమేళా ఈసారి 2027లో నాసిక్‌లో జరగనుంది. తర్వాత మహా కుంభమేళా



2169లో ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతుంది. ఈ కార్యక్రమం జూలై 17, 2027న ప్రారంభమై, ఆగస్టు 17, 2027న ముగియనున్నట్లు తెలుస్తోంది. ఇది నాసిక్ నుంచి సుమారు 38 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరి నది ఒడ్డున ఉన్న త్రయంబకేశ్వర్‌లో జరగనుంది. 2028లో 12 ఏళ్లకు ఒకసారి జరిగే పూర్ణ కుంభమేళా ఉజ్జయినిలో జరగనుంది. ఆ తర్వాత 2030లో ప్రయాగ్‌రాజ్ లో అర్ధ కుంభమేళా నిర్వహించనున్నారు.

# దేశవ్యాప్తంగా శివరాత్రి పర్వదినం

- జ్యోతిర్లింగ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- ఉజ్జయినిలో సిఎం మోహన్ యాదవ్ దంపతుల పూజలు
- గోరఖ్‌పూర్‌లో యోగి ప్రత్యేక పూజలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినాన్ని ప్రజలు మహా వేడుకగా జరుపుకున్నారు. దేశంలోని అన్ని శైవాలయాలు, జ్యోతిర్లింగాలు.. శివ భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచే ప్రధాన ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.వారణాసి, ఉజ్జయిని, సోమ్‌నాథ్ వంటి ప్రధాన శైవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోరక్‌పూర్‌లో సిఎం యోగి ఆదిత్యనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ దంపతులు ఉజ్జయినిలోని మహాకాలేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజులు, అభిషేకాలు చేశారు. ఆ ఆలయంలో ఇవాళ తెల్లవారుజామున భస్మహారతి నిర్వహించారు. ఆ తర్వాత మహాకాలుడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వారణాసిలోని కాశీ విశ్వనాథుడికి ఇవాళ ఉదయం ప్రత్యేక హారతి ఇచ్చారు. కాశీలో వేల సంఖ్యలో భక్తులు విశ్వనాథుడి దర్శనం కోసం ఎదురుచూస్తున్నారు. సుమారు అయిదు కిలోమీటర్ల మేర అక్కడ భక్తులు క్యూ కట్టనట్లు తెలుస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. ఢిల్లీలోని గౌరీశంకర్ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. హరిద్వార్‌లోని ధాకేశ్వర్ మహాదేవ్ ఆలయం వద్ద భక్తులు భారీ క్యూలైన్ కట్టారు. మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో త్రినేత్రుడి దర్శనం చేసుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు లక్షల సంఖ్యలో హాజరయ్యారు. జార్ఖండ్‌లోని దేవ్‌ఘర్‌లో ఉన్న జ్యోతిర్లింగ క్షేత్రమైన బాబా బైద్యనాథ్ ఆలయంలో కూడా భక్తులు కిటకిటలాడిపోయారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళలోని కొచ్చిలో ఉన్న అలువ మహాదేవ్ ఆలయానికి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గుజారాత్ లోని సోమ్‌నాథ్ ఆలయంలో వేకువజాము నుంచే అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. రామేశ్వరంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సముద్రస్నానాలు ఆచరించి శివుడి దర్శనం చేసుకు న్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న శివాలయాల్లో వేకువ జామునుంచే భక్తుల రద్దీ పెరిగింది. శ్రీకాళహస్తిలోని శివాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో ఆలయ దర్శనం కోసం వస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెల్లవారుజామున హనుమకొండ లోని వెయ్యి స్తంభాల గుడిలో పూజలు నిర్వహించారు. గ్వాలియర్‌లో ఉన్న అచలేశ్వర్ ఆలయంలో కూడా భక్తులు పెద్దగా ఎత్తున దర్శనాలు చేసుకున్నారు. ఏపీలోని శ్రీశైలంలో కూడా భారీగా పూజలు నిర్వహించారు.

# నీటిలో మునిగి తండ్రి, కుమారుడి మృతి

**శ్రీశైలం,ఫిబ్రవరి26:** పాతాళగంగలో పుణ్యస్నానానికి దిగిన తండ్రి, కుమారుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోవడంతో మృతి చెందిన విషాదకర సంఘటన బుధవారం చోటుచేసుకుంది. శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివదీక్ష విరమణకు వచ్చిన ఓ కుటుంబం తెలంగాణ పరిధిలోని లింగాలగట్టు పాతాళగంగ వద్ద స్నానం చేయడానికి నదిలోకి వెళ్లారు. అయితే ప్రమాదవశాత్తు అందులో మునగడంతో తండ్రి, కుమారులు మరణించారు. దీంతో గమనించిన స్థానికులు మృతదేహాలను వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

## లంగర్‌హౌస్‌లో..

**మెహిదీపట్నం:** లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హుడా పార్క్ చెరువు శుభ్రం చేసే క్రమంలో బుధవారం తండ్రీకొడుకులు మృతి చెందారు. జీహెచ్‌ఎంసీ అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఎండీ కరీం(38) లంగర్‌హౌస్‌లోని హుడా పార్క్ చెరువులో గుర్రపు డెక్క తీయడానికి వచ్చాడు. శివరాత్రి సందర్భంగా స్కూల్‌కు సెలవు ఉండడం వల్ల కొడుకు సాహిల్(15)ను తనతో పాటు తెచ్చాడు. మధ్యాహ్నం ప్రాంతంలో సాహిల్ లోతైన ప్రాంతానికి వెళ్లడంతో అక్కడ బురదలో ఇరుక్కుపోయి తండ్రిని సహాయం కోరాడు. తన కుమారుడిని రక్షించుకునేందుకు తండ్రి ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఇద్దరు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. తండ్రీకొడుకులు నీట మునిగిన విషయాన్ని ఇతర సిబ్బంది గమనించి ఎంటమాలజీ సూపర్‌వైజర్ రమేశ్‌కు సమాచారం అందించారు. పోలీసులు కూడా ఘటనాస్థలానికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాలను వెలికితీసి.. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

# రాజ్యసభ బరిలో కేజ్రీవాల్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి26:** ఢిల్లీలో ఇప్పటికిప్పుడు చేసేదేమీ లేదు. పంజాబ్ సిఎం అవుతారంటూ ఇటీవల కొన్ని కథనాలు వచ్చాయి. అయితే అలాంటి సాహసం చేసి పార్టీ పరువును తీసుకునే ప్రయత్నం చేయకపోవచ్చు. మోఢీని ఢీకొనాలంటే పార్లమెంటులో ఉండాలన్న యోచనలో ఉండివుండవచ్చు. ఈ క్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్ ఇక పార్లమెంట్‌లో అడుగుపెట్టనున్నారన్న ప్రచారం ఒకటి చక్కర్లుకొడుతోంది. పార్టీలో తాజా పరిణామాలతో ఈ ప్రచారం జోరందుకుంది. ఆయనను త్వరలోనే రాజ్యసభకు పంపించేందుకు ఆప్ ముమ్మర సన్నాహాలు చేస్తున్నట్లు కథనాలు వెలువడు తున్నాయి. అయితే, వీటిని పార్టీ తోసిపుచ్చింది.ప్రస్తుతం రాజ్యసభలో ఉన్న ఆప్ ఎంపీ సంజీవ్ అరోఢాను పార్టీ పంజాబ్ ఉప ఎన్నికల బరిలో నిలబెట్టింది. త్వరలో జరగబోయే లూథియానా వెస్ట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిగా సంజీవ్ పేరును ఖరారు చేస్తూ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీంతో కేజీవ్రాల్ పార్లమెంట్ ప్రవేశంపై వార్తలు గుప్పుమన్నాయి. సంజీవ్ అరోఢా 2022లో పంజాబ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2028లో ముగియనుంది. కాగా.. లూథియానా వెస్ట్ నుంచి ఎన్నికైన ఆప్ ఎమ్మెల్యే గుర్‌ప్రీత్ గోగి గత నెల మరణించడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో పార్టీ సంజీవ్‌ను బరిలోకి దించింది. ఉప ఎన్నికల్లో ఆయన గెలుపొందే అవకాశాలు ఎక్కువే ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఆయన ఎమ్మెల్యేగా గెలిచి, ఆ పదవిలో కొనసాగాలనుకుంటే.. రాజ్యసభ సభ్యత్వాన్ని



ఖాళీ చేయాల్సి ఉంటుంది. అప్పుడు పెద్దల సభలో ఖాళీ అయ్యే ఆ స్థానానికి కేజీవ్రాల్‌ను పంపించాలని ఆప్ భావిస్తున్నట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.అయితే, ఈ ప్రచారాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ ఖండించింది. అవన్నీ వదంతులేనని ఆప్ పంజాబ్ విభాగ అధికార ప్రతినిధి జగ్తర్ సింగ్ వెల్లడించారు. కేజీవ్రాల్‌ను రాజ్యసభకు పంపించే అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా ఈ ప్రచారం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఇక, ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ ఓటమిపాలైన సంగతి తెలిసిందే. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన పార్టీ అధినేత కేజీవ్రాల్ కూడా ఓడిపోయారు. ఆయన పోటీ చేసిన న్యూదిల్లీ శాసనసభ నియోజకవర్గం నుంచి భాజపా నేత పర్వేశ్‌వర్మ విజయం సాధించారు. ప్రస్తుతం దిల్లీ అసెంబ్లీలో మాజీ సీఎం ఆతిశీ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ఈక్రమంలో పార్లమెంటులో ఉండడవే శ్రేయస్కరమని కేజ్రీవాల్ భావిస్తున్నారు. లేకుంటే పార్టీని కాపాడుకోవడం కష్టం కావచ్చు.

ఖాళీ కడుపుతో టమాటా జ్యూస్ తాగితే..

# ఈజీగా బరువు తగ్గుతారు..



టమోటా అనేది దాదాపు ప్రతి ఇంట్లో ప్రతిరోజూ ఉపయోగించే ఒక ప్రధానమైన కూరగాయ. ఇది లేకుండా వంటకు తగినంత రుచి రాదు. వండిన తర్వాత తిన్నా, పచ్చిగా తిన్నా టమోటా రుచికరంగానే ఉంటుంది. ఆరోగ్యాన్ని ఇస్తుంది. టమోటా సలాడ్, సూప్, కూరగాయలతో కలిపి అనేక రకాల వంటకాలను తయారు చేయవచ్చు. కానీ టమోటా రసం తాగడం వల్ల శరీరానికి ఒకటి లేదా రెండు కాదు, లెక్కలేనన్ని ప్రయోజనాలు లభిస్తాయని మీకు తెలుసా? ఎందుకంటే ఇందులో ఫోలేట్, విటమిన్ సి, పొటాషియంతో పాటు ఫైటోన్యూట్రియెంట్స్ కెరోటినాయిడ్లు ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక సమస్యల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. కాబట్టి టమోటా రసం ఎవరు తాగాలి.. ఎందుకు తాగాలి అనే దాని గురించి ఆలస్యం చేయకుండా తెలుసుకుందాం.

**టమోటా రసం తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు..**

బరువు తగ్గడం : టమోటాలలో కేలరీల పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మీరు కూడా మీ బరువు పెరిగిందని ఆందోళన చెందుతుంటే ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో ఒక గ్లాసు టమోటా రసం తీసుకోవడం ప్రారంభించండి.

ఎముకలు : మీరు బలహీనమైన ఎముకల సమస్యతో బాధపడుతుంటే టమోటా రసం తీసుకోవడం మీకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇందులో విటమిన్ కె, కాల్షియం ఉంటాయి. ఇవి బలహీనమైన ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి.

కడుపు సమస్యలు : టమోటా రసం తీసుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు తొలగిపోతాయి. మీరు నల్ల ఉప్పును జోడించి కూడా జ్యూస్ తయారుచేసుకుని తాగవచ్చు.

గుండె : గుండె రోగులు తమ ఆహారం, పానీయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. ఇక టమోటా గుండె ఆరోగ్యానికి మంచి చేసే కూరగాయ అని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

చర్మం : టమోటాలలో లైకోపీన్, విటమిన్ సి, విటమిన్ ఇ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.

- ఖాళీ కడుపుతో టమోటా రసం తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. ఈ జ్యూస్ తయారీ విధానం తెలుసుకోండి..
- ముందుగా జ్యూసీగా ఉన్న పండిన టమోటాలను ఎంచుకోండి.
- టమోటాలను బాగా కడిగి చిన్న ముక్కలుగా కోయాలి.
- తరువాత టమోటాలను కొద్దిగా నీటితో కలిపి మెత్తని పేస్ట్ అయ్యేవరకు కలపండి.
- గింజలు లేదా గుజ్జును తీయడానికి రసాన్ని వడకట్టండి. ఎక్కువసేపు ఉంచితే దాని పోషకాలు కోల్పోయే అవకాశం ఉంది. కాబట్టి వడకట్టిన వెంటనే రసం తాగడం మంచిది.



- త్రాగే ముందు రుచి కోసం కొద్దిగా ఉప్పు, నిమ్మరసం కలిపి పిండి వేయండి.
- జీర్ణక్రియ సులభతరం కావడానికి రసం మీ లాలాజలంతో కలిసేలా నెమ్మదిగా త్రాగండి.
- కానీ ఖాళీ కడుపుతో టమోటా రసం తాగిన తర్వాత ఏదైనా అసౌకర్యం లేదా అలెర్జీ ఉంటే, వైద్యుడిని సంప్రదించడం మంచిది.

# భక్తులతో ఆలయాలు కిటకిట





**కరీంనగర్, జనతా న్యూస్:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల వ్యాప్తంగా మహా శివరాత్రి ని పురస్కరించుకొని భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. నుస్తులాపూర్ , పర్లపల్లి, పొలంపల్లి గ్రామాల్లో ఆలయాలు, ఎల్ఎండి కాలనీలో గల శ్రీ గిరిజ మృత్యుంజయ మహాదేవాలయానికి భక్తులు ఉదయం నుండే పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మృత్యుంజ ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ చల్ల మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు లు అన్ని రకాల వసతులు కల్పించారు. శ్రీ గిరిజ మృత్యుంజయ మహా దేవాలయంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి కొన్న ప్రభాకర్ మాట్లాడుతూ మాట్లాడుతూ వచ్చే ఏడాదిలో విస్తారంగా వర్షాలు కురిసి పాడి పంటలు, ప్రజలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు. అభిషేక పూజలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, టీఎస్టీఓ

రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, డిఎస్టీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ కేతిరెడ్డి వనిత దేవేందర్ రెడ్డి, కాళేశ్వరం రిటైర్డ్ ఈఎన్ సీ నల్లా వెంకటేశ్వర్లు, ఈఈ నాగభూషణం పలు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బాలకిషన్ రావు, సహాయ కోశాధికారి బట్టు కరుణాకర్, పోలు కిషన్, ఒంటెల రవీందర్ రెడ్డి, గాంగారపు రమేష్ ఉన్నారు.

# వేసవి వచ్చేస్తోంది..

**ఈ విషయాలు తెలుసుకుంటే బిందాస్‌గా బ్రతికేస్తారు..**



వేసవిలో శరీరం కొన్ని ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటుంది. వాపు, చికాకు, ఆమ్లత్వ స్థాయిలు వంటి పరిస్థితులకు కారణవ-ఎవుతుంది. ఇది వేడి వాతావరణం, కారంగా ఉండే ఆహారం, ఒత్తిడి, హార్మోన్ల మార్పులు, నిర్జలీకరణం వంటి పరిస్థితులతో సహా వివిధ కారణాల వల్ల సంభవించవచ్చు.

అయితే, కొన్ని యోగా ఆసనాలు రక్త ప్రసరణను మెరుగుపరచడంతోపాటు ఎండకాలంలో శరీరం నుండి వేడిని సమ-ర్థవంతంగా తొలగించడంలో సహాయపడతాయి. కాబట్టి, వేసవిలో మీరు ఏ యోగా భంగిమలను సాధన చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం..

మీ వీపుపై పడుకుని, మీ కాళ్ళను గోడపైకి చాపండి. మీ చేతులను రిలాక్స్ పొజిషన్‌లో ఉంచండి, లోతుగా శ్వాస తీసుకోండి. ఈ ఆసనాన్ని 5-10 నిమిషాలు చేయండి.

**చల్లని శ్వాస**

మీ వెన్నెముకను నిటారుగా, సౌకర్యవంతంగా ఉంచి కూర్చోండి. నెమ్మదిగా మీ ముక్కు ద్వారా గాలిని పీలుస్తూ నోటి ద్వారా గాలిని బయటకు వదలండి. దీన్ని 5-10 నిమిషాలు పునరావృతం చేయండి.

**బాలసన**

మీరు మీ మోకాళ్లపై కూర్చోవాలి, మీ కాలి వేళ్లు ఒకదానికొకటి తాకుతూ ఉండాలి. మీ మడమల మీద వెనక్కి వాలి, మీ చేతులను ముందుకు చాచి, మీ నుదిటిని మెల్లగా చాపి విశ్రాంతి తీసుకోండి. లోతుగా శ్వాస తీసుకోండి. ఈ ఆసనాన్ని 1-2 నిమిషాలు పట్టుకోండి.

**శవాసన**

మీ వీపుపై పడుకుని, మీ చేతులు, కాళ్ళను కొద్దిగా దూరంగా ఉంచి విశ్రాంతి తీసుకోండి. కళ్ళు మూసుకోండి, నెమ్మదిగా లోతైన శ్వాస తీసుకోండి. ఈ భంగిమలో 5-10 నిమిషాలు ఉండండి.

# కివి తినడం వల్ల బాగా నిద్రపడుతుందా..

సాధారణంగా, పండ్లు ఆరోగ్యానికి చాలా మంచివి. పండ్లలో శరీరానికి అవసరమైన అనేక పోషకాలు ఉంటాయి. కివి అత్యంత ఆరోగ్యకరమైన పండ్లలో ఒకటి. డెంగ్యూ జ్వరం వంటి వ్యాధుల కారణంగా ప్లేట్‌లెట్ కౌంట్ పడిపోయినప్పుడు వైద్యులు వీటిని తినమని సిఫార్సు చేస్తారు. ఇది చిన్నదిగా అనిపించినప్పటికీ, దాని ప్రయోజనాలు లెక్కలేనన్ని ఉంటాయి. కివీస్ తినడం వల్ల బాగా నిద్రపడుతుందని కొంతమంది అంటారు. అయితే, ఇది ఎంత వరకు నిజమో ఇప్పుడు తెలుసుకుందాం..

**బాగా నిద్రపోతారు**

కివి పండులో యాంటీఆక్సిడెంట్లు, సెరోటోనిన్ వంటి అనేక సమ్మేళనాలు ఉన్నాయి, ఇవి నిద్ర రుగ్మతలకు చికిత్స చేయడంలో ఉపయోగపడతాయి. ముఖ్యంగా నిద్రలేమితో బాధపడేవారు రాత్రి పడుకునే ముందు రెండు కివి పండ్లను నాలుగు వారాల పాటు తినడం వల్ల బాగా నిద్రపోతారని నిపుణులు చెబుతున్నారు.

**కార్టిసాల్‌ను నియంత్రిస్తుంది**

కివిలో ఉన్న విటమిన్ సి, విటమిన్ బి సరిగ్గా నిద్రపోవడానికి సహాయపడుతాయి. ఈ పండు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటుంది. అందువల్ల ఇది కార్టిసాల్‌ను నియంత్రిస్తుంది. కార్టిసాల్‌ను ఒత్తిడి హార్మోన్ అని కూడా పిలుస్తారు. దాని స్థాయిలు తగినంత సమతుల్యంగా లేకపోతే, అది నిద్రకు అంతరాయం కలిగిస్తుంది. కివి పండ్లు కార్టిసాల్ స్థాయిలను మరింత స్థిరంగా ఉంచుతాయి.

**నిద్ర నాణ్యత పెంచుతుంది**

మీ రోజువారీ ఆహారంలో కివిని చేర్చుకోవడం వల్ల, ముఖ్యంగా రాత్రిపూట నిద్ర రుగ్మతలను సహజంగా నిర్వహించడంలో సహాయపడుతుంది. కివి పండులో పోషకాలు, నిద్రను పెంచే లక్షణాలు ఉండటం వల్ల నిద్ర నాణ్యత తక్కువగా ఉన్న వ్యక్తులకు ఇది ఎంతో మంచి పండు.



# యువతలో పెరుగుతున్న గుండెపోటు గుబులు..

క అమ్మాయి లేదా అబ్బాయి స్కూల్ గ్రౌండ్ స్నేహితులతో కలిసి సరదాగా ఆడుకుంటూనే గుండెపోటు వచ్చి హఠాత్తుగా కుప్పకూలిపోతారు. ఇక పట్టుమని పాతిక దాటని యువకుడు చూసేందుకు దృఢంగానే ఉంటాడు. రోజూ జిమ్ చేస్తాడు. కానీ ఇంట్లో వాళ్లతో భోజనం చేస్తూనో, క్లాసులో పాఠాలు వింటూనో, ఆఫీసులో పనిచేస్తూనో సడన్‌గా గుండె ఆగిపోయి చనిపోతాడు. ప్రస్తుతం వార్తాపత్రికలు, టీవీలు, సోషల్ మీడియాలో ఇలాంటి వార్తలు తరచూ వినిపిస్తున్నాయి. ఒకప్పుడు పెద్ద వయసు వాళ్లలోనే కనిపించే ఈ సమస్య పసిహృదయాలనూ వేధిస్తోంది. అసలు ఎందుకిలా జరుగుతోంది. కారణాలేంటి..

**చిన్నతనంలోనే గుండెపోటు గుబులు..**

మనం బతికున్నకాలం నిర్విరామంగా విశ్రాంతి తీసుకోకుండా పనిచేసే ఏకైక అవయవం గుండె. ఒక్క క్షణం ఆగినా శరీరంలోని ఏ భాగం పనిచేయలేదు. వందేళ్ల పాటు పనిచేసి మన ప్రాణాలను నిలబెట్టాల్సి గుండె పట్టుమని 18 ఏళ్లు కూడా నిండని వారిలో కూడా ఆగిపోతోంది. ఇందుకు కారణాలు అనేకం. కొన్ని సార్లు చురుగ్గా, క్రమశిక్షణతో ఉండే అథ్లెట్లు హార్ట్ అటాక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎందుకంటే నేటితరం జీవనశైలి పూర్తిగా మారిపోయింది. ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోలేకపోతున్నారు. శారీరక శ్రమ లోపించడం, మానసిక ఒత్తిడి వల్ల కార్టిసాల్ స్థాయి పెరిగి బీపీ రావడం, అనారోగ్యకర ఆహార అలవాట్లు ఇలా ఎన్నో కారణాల వల్ల గుండె పనితీరుకు ఆటంకం కలుగుతోంది.

**ఈ అలవాట్లు మానుకోకుంటే కష్టం..**

నిత్యం క్షణం తీరికలేకుండా గడపుతోంది నేటి యువతరం. అందుకే చాలామంది ప్రాసెస్ ఫుడ్, జంక్ ఫుడ్, బయట వండిన ఆహారాన్ని అతిగా తినేస్తున్నారు. ఈ పదార్థాల్లోని కొవ్వులు, నూనెలు, చక్కెరలు వంటివి బీపీ, షుగర్, అల్సర్లు, కొలెస్ట్రాల్ తదితర అనారోగ్యాలను తెచ్చిపెడుతూ హార్ట్ ఎటాక్ వచ్చేందుకు బాటలు పరుస్తున్నాయి. పుట్టిననాటి నుంచి అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, జీవనశైలి సరిగా లేకపోవడం, వ్యాయామాలు చేయకపోవడం, సరిపడినంత నిద్రకు దూరమవడం వల్ల ఊబకాయులుగా మారిపోతున్నారు. గుండెపోటు, డయాబెటిస్, బీపీ సహా అన్ని వ్యాధులకు మూలం అధిక బరువే. ఇక మద్యం, ధూమపానం వంటి అనేక కారణాల వల్ల కూడా శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగిపోయి గుండెకు రక్తప్రసరణ ఆగిపోతోంది. కాబట్టి, మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేలా జీవనవిధానం, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుని మీ గుండెని రక్షించుకోండి.





## కాంక్రీట్‌లో ఆహార వ్యర్థాలు..
### దృఢంగా నిర్మాణాలు

**ఇండోర్ :** మిగిలిపోయిన ఆహార వ్యర్థాలను చెత్తబుట్టలో పడేస్తుంటాం. ముఖ్యంగా పండ్లు, కొన్ని కూరగాయలు తినగా మిగిలిన పీచు, తొక్కలు వంటి వ్యర్థాల వల్ల చాలా లాభాలున్నాయట. హానికరం కాని బ్యాక్టీరియాతో కూడిన ఆ వ్యర్థాలను కాంక్రీటులో కలపడం ద్వారా నిర్మాణాలు మరింత దృఢంగా ఉంటాయని ఐఐటీ ఇండోర్ పరిశోధనలో వెల్లడైంది. అంతేకాకుండా, దీని వల్ల కర్బన ఉద్గారాలు తగ్గుతాయని పరిశోధన బృందం తెలిపింది. పండ్ల వ్యర్థాలు కుళ్లిపోయినప్పుడు దాని నుంచి కార్బన్ డై ఆక్సైడ్ విడుదలవుతుంది. అయితే.. హానికర బ్యాక్టీరియా లేని వ్యర్థాలను కాంక్రీటులో కలిపినప్పుడు దానిలోని కాల్షియం అయాన్‌లతో కార్బన్ డై ఆక్సైడ్ చర్య జరుపుతుంది. ఫలితంగా కార్బోనేట్ స్ఫటికాలు ఏర్పడతాయి. అవి కాంక్రీట్‌లో ఉన్న రంధ్రాలు, పగుళ్లల్లో చేరుతాయి. దీంతో నిర్మాణం మరింత బలంగా మారుతుందని ప్రొఫెసర్ సందీప్ చౌదరి 'పీటీఐ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. "కాలీఫ్లవర్ కాడలు, బంగాళదుంప తొక్కలు, మెంతికూర కాడలు, నారింజ తొక్కలు, కుళ్లిన బొప్పాయి గుజ్జు వంటి వ్యర్థాలతో హానికరంకాని బ్యాక్టీరియాను కాంక్రీటులో కలిపి పరిశీలించాం. రంధ్రాలు పూడ్చిన అనంతరం ఆ బ్యాక్టీరియా పెరగడం ఆగిపోతుంది. ఆ తర్వాత నిర్మాణానికి ఎలాంటి హాని ఉండదు. అయితే.. తేమ తక్కువగా ఉన్న వ్యర్థాలను పొడి చేసి తగినంత నీరు కలిపి కాంక్రీటును సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ రసాయన వాడకాలను తగ్గించి నాణ్యమైన నిర్మాణానికి తోడ్పడుతుంది" అని ఆయన వివరించారు.

### తమిళంలో మాట్లాడలేకపోతున్నా..
## క్షమించండి : అమిత్ షా



**చెన్నై :** జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే అతి ప్రాచీన భాష తమిళం అని పేర్కొన్నారు. అటువంటి గొప్ప భాషలో మాట్లాడలేకపో తున్నందుకు తనను క్షమించాలని ఆయన అక్కడి ప్రజలను కోరారు. అధికార డీఎంకే ప్రభుత్వంపై ఈ సందర్భంగా విరుచుకుపడ్డారు. 2026 ఎన్నికల్లో దేశ వ్యతిరేక పార్టీ అయిన డీఎంకే ఓటమి పాలవుతుందని.. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 2024 భాజపాకు చారిత్రాత్మక ఏడాదిగా నిలిచిందని షా అన్నారు. అదే ఏడాది నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానిగా ఎన్నికయ్యారని.. చాలా ఏళ్ల తర్వాత అంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మహారాష్ట్ర, హరియాణా, దిల్లీ ప్రజలు భాజపాపై విశ్వాసంతో తమకు అధికారం కట్టబెట్టారని అన్నారు. కుటుంబ రాజకీయాలను, అవినీతిని అంతం చేస్తూ.. 2026లో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అయితే తాము ద్వి భాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఇదే విషయంపై తమిళనాడు సీఎం స్టాలిన్ స్పందిస్తూ...'తమిళ భాషకు, ప్రజలకు, రాష్ట్రానికి నష్టం కలిగించే చర్యలను అనుమతించేది లేదు' అని స్పష్టం చేశారు. దీనిపై తమిళనాడు నేతలకు, కేంద్రానికి మధ్య వాగ్యుద్ధం కొనసాగుతోన్న వేళ తమిళ భాషను కీర్తిస్తూ అమిత్ షా ప్రసంగించడం గమనార్హం.



### మోడీ-జిన్‌పింగ్ కజాన్ భేటీ తర్వాతే
## ఇరు దేశాల సంబంధాలు మెరుగు
**- చైనా దౌత్యవేత్త**

**బీజింగ్ :** కజాన్‌లో గతేడాది భారత ప్రధాని మోడీ – చైనా అధినేత జిన్‌పింగ్ మధ్య భేటీ జరిగిన తర్వాతే ఇరు దేశాల సంబంధాలు కొంత మెరుగయ్యాయి. ఈ విషయాన్ని చైనా దౌత్యవేత్త షు ఫిహాంగ్ ధ్రువీకరించారు. వాస్తవానికి ఇరు దేశాధినేతల భేటీ తర్వాత భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బీజింగ్‌లో పర్యటనతో ఇరు దేశాలు పలు అంశాలపై ఓ అవగాహనకు వచ్చేందుకు ఉపయోగపడిందన్నారు. తాజాగా విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, చైనా మంత్రి వాంగ్‌యి మధ్య భేటీ అనంతరం ఫిహాంగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. జీ20 సహా ఇతర కీలక వేదికలపై ఇరు దేశాలు పరస్పరం సహకరించుకోవాలని పేర్కొన్నారు. "అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రధాని మోడీ కజాన్‌లో భేటీ తర్వాత నుంచి నాటి నుంచి ఇరు పక్షాలు చర్చల్లో అంగీకారానికి వచ్చిన అంశాలను బలంగా అమలు చేస్తున్నాయి. వివిధ స్థాయిల్లో సంప్రదింపులు జరుగుతున్నాయి. చాలా అంశాల్లో సమష్టిగా అవగాహనకు వచ్చాం" అని 3వ ఇండో–చైనా యూత్ డైలాగ్ వద్ద ఫిహాంగ్ ఓ ఆంగ్ల వార్తా పత్రిక వద్ద వ్యాఖ్యానించారు. మోడీ, జిన్‌పింగ్ 2024 బ్రిక్స్ సదస్సు సందర్భంగా కొద్దిసేపు భేటీ అయ్యారు. ఇరు దేశాలు తూర్పు లద్దాఖ్‌లో ఉద్రిక్తతలు చల్లార్చుకొని బలగాలను వెనక్కి రప్పించాలని నిర్ణయించారు. తాజాగా జైశంకర్, వాంగ్‌యీ భేటీలో కూడా పరస్పర విశ్వాసం పెంపొందించుకొనే చర్యలు చేపట్టాలని, సంయుక్తంగా సరిహద్దుల్లో శాంతిని కాపాడాలని నిర్ణయించారు. మరోవైపు, ఈ ఏడాది చివర్లో చైనా షాంఘై సహకార సంస్థ (ఎస్–సీవో) చైనా ఆతిథ్యం ఇవ్వనుంది. దీనిలో ప్రధాని మోడీ పాల్గొంటారని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే యూరేషియన్ బ్లాక్‌లో భారత్ పాత్రను ఫిహాంగ్ ప్రశంసించారు. న్యూఢిల్లీతో కలిసి పనిచేయడానికి బీజింగ్ సిద్ధంగా ఉందన్నారు.

## మరోసారి రష్యా పర్యటనకు ప్రధాని మోడీ..!



**ఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి రష్యాలో పర్యటించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అక్కడ జరగనున్న 'గ్రేట్ పేట్రియాటిక్ వార్' 80వ వార్షికోత్సవ పరేడ్‌లో ఆయన పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈవిషయాన్ని అక్కడి వార్తా సంస్థ టాస్ వెల్లడించింది. టాస్ ప్రకారం.. మే 9న మాస్కోలోని రెడ్ స్క్వేర్ వద్ద 'గ్రేట్ పేట్రియాటిక్ వార్' 80వ వార్షికోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి మోదీ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. భారత సైనికదళం సైతం కవాతు నిర్వహించనున్నట్లు సమాచారం. అయితే, దీనిపై విదేశాంగ శాఖ ఏ ప్రకటన చేయలేదు. ఇక, ఈ పరేడ్‌కు వివిధ దేశాల అధినేతలను ఆహ్వానిస్తున్నట్లు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. ఇదిలాఉండగా.. గతేడాది అక్టోబరులో మోడీ రష్యాలో పర్యటించారు. కజన్ వేదికగా జరిగిన 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆ దేశాధ్యక్షుడు పుతిన్ , చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహా పలువురు దేశాధినేతలతో మోడీ చర్చలు జరిపారు. బ్రిక్స్ సదస్సులో ప్రసంగించిన మోడీ.. దౌత్యం, చర్చలకు భారత్ మద్దతిస్తుందని, యుద్ధానికి కాదని పునరుద్ఘాటించారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో కల్లోల పరిస్థితులు, ఆర్థిక అస్థిరత, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం వంటి పలు సమస్యలపై ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు.. రష్యా– ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం మొదలై మూడేళ్లు పూర్తయ్యింది. ఈనేపథ్యంలో ఇరుదేశాల మధ్య శాంతి నెలకొల్పేందుకు అమెరికాతో సహా పలు దేశాలు కృషి చేస్తున్నాయి. ఈక్రమంలో మోదీ మాస్కోలో పర్యటనకు వెళ్లడం గమనార్హం.


## ఎక్స్‌లో 2 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతా


### మస్క్‌కు ఆర్థిక నేరగాడి లేఖ



**ఢిల్లీ:** ఫోన్ల సాయంతో రూ.200 కోట్లు మోసం చేసిన నేరగాడు సుఖేశ్ చంద్రశేఖర్ ఢిల్లీలోని మండోలీ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అయితే ప్రేమ పేరుతో తరచూ తన సన్నిహితురాలు, సినీ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కు లేఖలు పంపుతుంటాడు. తాజాగా అతడు రాసిన మరో లేఖ బయటకు వచ్చింది. అయితే అది రాసింది మాత్రం నటికి కాదు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు. టెస్లా అధినేత, సోషల్ మీడియా ఎక్స్ రూపకర్త ఎలాన్ మస్క్‌కు ఆర్థిక నేరగాడు సుఖేశ్ ఓ లేఖ రాశారు. తాను ఎక్స్ సంస్థలో 2 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని అనుకుంటున్నానని అందులో పేర్కొన్నారు. ఇప్పటికిప్పుడే 1 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టి.. మరో బిలియన్ డాలర్లను వచ్చే ఏడాది పెట్టడానికి సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. మస్క్‌ను తన మనిషి అంటూ సంభోదించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు ముఖ్య పాత్ర పోషించడం, డోజ్‌కు సంబంధించిన వ్యవహారాలను సమ–ర్థవంతంగా వ్యవహరిం చడం వంటివి పేర్కొంటూ మస్క్‌ను అభినందించారు. తన సన్నిహితురాలు, సినీ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కు, తనకు ఇద్దరికీ ఎక్స్ చాలా ఇష్టమైన సామాజిక మాధ్యమమని.. అందువల్లే అందులో పెట్టుబడి పెట్టాలని నిర్ణయించుకున్నానని తెలిపాడు. ఆమెను తన 'లేడీ లవ్' గా అభివర్ణించాడు.సుఖేశ్ 2020 జూన్ నుంచి మే 2021 వరకు మొబైల్ ఫోన్లు, వాయిస్ మాడ్యూలర్లు వినియోగిస్తూ ర్యాన్‌బ్యాక్సీ కంపెనీ మాజీ యజమాని శివీందర్ సింగ్ భార్య అధితిసింగ్‌కు ఫోన్లు చేసేవాడు. ముందు తనను తాను లా సెక్రటరీ అనూప్‌కుమార్‌గా పరిచయం చేసుకొన్నాడు. శివీందర్ సింగ్‌కు బెయిల్ ఇప్పిస్తానని ఆమెనుంచి రూ.200 కోట్లకుపైగా వసూలు చేశాడు. ఎన్నాళ్లకూ బెయిల్ రాకపోవడంతో అధితికి అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించడంతో విషయం బయటపడింది. ఈ క్రమంలోనే సుఖేశ్, జాక్వెలిన్‌తో క్లోజ్‌గా ఉన్న ఫొటోలు బయటకు వచ్చాయి. ఆమె తన ప్రియురాలు అని చెప్పుకొచ్చారు. అయితే సుఖేశ్ తనను తాను హోంశాఖలో ఓ ముఖ్య అధికారిని అని పరిచయం చేసుకున్నాడని.. అనంతరం తనను ఎన్నో ఇబ్బందులకు గురిచేశాడని జాక్వెలిన్ వాపోయారు.

## టికెట్ లేకుండా ఏసీ కోచ్‌లో ప్రయాణించిన పోలీస్..





**న్యూఢిల్లీ :** ఒక పోలీస్ ఎలాంటి టికెట్ లేకుండా ఏసీ కోచ్‌లో ప్రయాణించాడు. ఒక బెర్త్‌పై హాయిగా నిద్రించాడు. దీనిని గుర్తించిన టీటీఈ ఆ పోలీస్‌ను నిలదీశాడు. రైలు మీ ఇల్లు అని అనుకుంటున్నారా? అని మందలించాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. యూనిఫార్మ్‌లో ఉన్న ఒక పోలీస్ రైలులోని ఏసీ కోచ్‌లో ప్రయాణించాడు. ఖాళీగా ఉన్న బెర్త్‌పై నిద్రించాడు. ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ) ఆ బెర్త్ వద్దకు వచ్చాడు. టికెట్ చూపించాలని ఆ పోలీస్‌ను అడిగాడు.కాగా, ఆ పోలీస్ టికెట్ లేకుండా ఏసీ కోచ్‌లో ప్రయాణిస్తున్నట్లు టీటీఈ తెలుసుకున్నాడు. దీంతో యూనిఫార్మ్ ధరించిన పోలీస్‌ను టికెట్ చూపించమని టీటీఈ అడగకూడదని మీరు అనుకుంటున్నారా? అని ప్రశ్నించాడు. 'కనీసం జనరల్ కోచ్ టికెట్ కూడా మీ వద్ద లేదు. కానీ ఏసీ కోచ్‌లో నిద్రపోతున్నారు. ఎక్కడ కావాలంటే అక్కడ పడుకోవడానికి ఇది మీ ఇల్లని అనుకుంటున్నారా? లేచి వెళ్లండి' అని మండిపడ్డాడు. దీంతో ఆ పోలీస్ బెర్త్ నుంచి లేచి తన బ్యాగ్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మరోవైపు రెడ్డిట్‌లో షేర్ చేసిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో టికెట్ లేకుండా ఏసీ కోచ్‌లో ప్రయాణిం చిన పోలీస్‌ను ధైర్యంగా టీటీఈ నిలదీయడాన్ని నెటిజన్లు ప్రశంసించారు. అయితే టికెట్ లేకుండా ప్రయాణించిన ఆ పోలీస్‌కు ఎలాంటి జరిమానా విధించకుండా టీటీఈ వదిలేసిన తీరును కొందరు విమర్శించారు.

## గాడ్సేను ప్రశంసించిన
## నిట్ ప్రొఫెసర్.. డీన్‌గా నియామకం



**తిరువనంతపురం:** మహాత్మా గాంధీని హత్య చేసిన గాడ్సేను నిట్ ప్రొఫెసర్ ప్రశంసించింది. దీనిపై కేసు నమోదుకావడంతో అరెస్టైన ఆమె బెయిల్‌పై విడుదలైంది. అయితే ఆ మహిళా ప్రొఫెసర్‌ను ప్రస్తుతం డీన్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో నిట్ నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) కాలికట్‌లో ప్రొఫెసర్ అయిన డాక్టర్ షైజా 2024లో గాంధీ వర్ధంతి రోజున ఒక న్యాయవాది షేర్ చేసిన పోస్ట్‌పై ప్రతిస్పందించారు. నాథూరామ్ గాడ్సేను ఆమె ప్రశంసించారు. గాంధీని హత్య చేసి భారతదేశాన్ని కాపాడినందుకు గాడ్సే పట్ల గర్వపడుతున్నట్లు ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.కాగా, విద్యార్థి సంఘాలైన డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, యూత్ కాంగ్రెస్, ప్రొఫెసర్ షైజాపై నాడు మండిపడ్డాయి. వారి ఫిర్యాదులతో గత ఏడాది ఫిబ్రవరిలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమెను అరెస్ట్ చేసి ప్రశ్నించారు. అయితే కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో విడుదలయ్యారు. ఆ కేసు విచారణ పెండింగ్‌లో ఉన్నది. మరోవైపు ప్రొఫెసర్ షైజాను తాజాగా ప్లానింగ్, అభివృద్ధి విభాగం డీన్‌గా నియమించారు. మార్చి 7 నుంచి ఇది అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అప్పటి వరకు ప్రస్తుత డీన్ డాక్టర్ ప్రియా చంద్రన్‌తో కలిసి పనిచేయాలని షైజాకు సూచించారు. నిట్ కాలికట్ డైరెక్టర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, వివాదస్పద ప్రొఫెసర్ షైజాను డీన్‌గా నియమించడాన్ని కేరళలోని రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. నిట్ నిర్ణయంపై మండిపడ్డాయి. అధికార సీపీఎం యువజన విభాగం డీవైఎఫ్ఐ దీనిపై నిరసనకు పిలుపునిచ్చింది.

## వారిపై లైఫ్ బ్యాన్ అత్యంత కఠినం..

### ఆరేళ్ల నిషేధం చాలు.. సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్


**ఢిల్లీ :** మన దేశంలో రాజకీయ నాయకులు ఏవైనా క్రిమినల్ కేసుల లో దోషులుగా నిరూపితమైతే వారిపై ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం ఉంటుంది. అయితే క్రిమినల్ కేసులలో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై కేవలం ఆరేళ్ల నిషేధం సరిపోదని, జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా వారిపై నిషేధం విధించాలని కోరుతూ అశ్వినీ ఉపాధ్యాయ్ అనే న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.ఇటీవల ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. మీ అభిప్రాయం తెలుపుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేంద్రం బుధవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాల నిషే ధం విధించడం అత్యంత కఠినమైన చర్య అని, కాబట్టి ప్రస్తు తం అమల్లో ఉన్న ఆరేళ్ల నిషేధం సరిపోతుందని తన అఫిడవిట్‌లో పేర్కొంది. అయినా క్రిమినల్ కేసులలో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాల నిషేధం విధించాలా..? ఆరేళ్ల నిషేధం విధించాలా..? అనేది పార్లమెంట్ పరిధిలోని అంశమని, పార్లమెంట్ ఇప్పిటికే అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని ఆరేళ్ల నిషేధం విధించాలని నిర్ణయించిందని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇక ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తన తుది నిర్ణయం వెల్లడించాల్సి ఉంది.



## కోర్టుల్లో కేసుల వాదనకు..
### రూ.400 కోట్లకుపైగా ఖర్చు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: కోర్టుల్లో కేసుల వాదనకు కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో రూ.400 కోట్లకు పైగా ఖర్చు చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో వ్యాజ్యాల కోసం కేంద్రం రూ.66 కోట్లు వ్యయం చేసింది. గత ఆర్థిక సంవత్సరం కంటే ఇది రూ.9 కోట్లు ఎక్కువ. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు సమాధానం ఇచ్చింది. 2014–15లో వ్యాజ్యాల కోసం రూ.26.64 కోట్లు, 2015–16లో రూ.37.43 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. 2014–15 నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరాల మధ్య గత పదేళ్లలో కోర్టుల్లో వ్యాజ్యాల కోసం రూ. 409 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కాగా, దేశంలోని పలు కోర్టుల్లో పెండింగ్ ఉన్న సుమారు ఏడు లక్షల కేసుల్లో కేంద్రం ఒక పార్టీగా ఉందని న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ఇటీవల రాజ్యసభకు తెలియజేశారు. సుమారు రెండు లక్షల కేసుల వ్యాజ్యాల్లో ఆర్థిక మంత్రిత్వ శాఖ మాత్రమే లిటిగెంట్‌గా ఉందని చెప్పారు. లీగల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ బ్రీఫింగ్ సిస్టమ్ డేటా ఆధారంగా ఈ వివరాలు వెల్లడించారు. మరోవైపు పెండింగ్ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడానికి ప్రయత్నించే జాతీయ వ్యాజ్య విధానంపై ప్రభుత్వం కృషి చేస్తోందని న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా మార్పులు చేర్పులతో పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదిత ముసాయిదాపై కేంద్ర మంత్రివర్గం త్వరంలో తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

## బీహార్ క్యాబినెట్ విస్తరణ..
### ఏడుగురు బీజేపీ ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం..



**పాట్నా :** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బుధవారం తన మంత్రివర్గాన్ని విస్తరించారు. కొత్తగా ఏడుగురు బీజేపీ ఎమ్మెల్యేల కు మంత్రివర్గంలో చోటు కల్పిం చారు. ఈ ఏడాది నవంబర్‌లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా ఇప్పుడు సీఎం నితీశ్ తన క్యాబినెట్‌ను విస్తరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్తగా నితీశ్ క్యాబినెట్లో చేరిన ఏడుగురు బీజేపీ ఎమ్మెల్యేల్లో సంజయ్ సరోగి, సునీల్ కుమార్, జిబేశ్ మిశ్రా, మోతీలాల్ ప్రసాద్, క్రిషన్ కుమార్ మాంటూ, రాజు కుమార్ సింగ్, విజయ్ కుమార్ మండల్ ఉన్నారు. వారందరూ బుధవారం సాయంత్రం 4 గంటలకు మంత్రులుగా ప్రమాణ స్వీకారాలు చేశారు. బీహార్ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ వారి చేత ప్రమాణస్వీకారాలు చేయించారు.ఇటీవల బీహార్ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో ఆ రాష్ట్ర రెవెన్యూ మంత్రి దిలీప్ జైస్వాల్ తన పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఒక వ్యక్తికి ఒకే పదవి అనే పార్టీ పాలసీకి అనుగుణంగా తాను రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు ఆరుగురు నూతనంగా మంత్రులుగా ప్రమాణం చేసినందున.. జైస్వాల్ రాజీనామా చేస్తే బీహార్ మంత్రి వర్గంలో మొత్తం ఆరుగురు మంత్రులు పెరగనున్నారు.

## గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సులో
## భోజన ప్లేట్ల కోసం కొట్లాట..

**భోపాల్:** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ప్రపంచ మదుపరుల శిఖరాగ్ర సదస్సు (గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్) జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. దీనికి దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున మదుపర్లు హాజరై రూ.లక్షల కోట్ల మేర పెట్టబడులను ప్రకటించారు. అయితే, ఈ కార్యక్రమంలో సామన్య ప్రజల కోసం చేసిన ఏర్పాట్లు మాత్రం అరకొరగా ఉన్నాయి.ఈ సదస్సు కు వచ్చిన సామాన్యులు భోజన ప్లేట్ల కోసం కొట్లాడుకుంటున్న దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అతిథులు హాజరయ్యారు. అయితే, సరైన సౌకర్యాలు లేకపోవడంతో భోజన సమయంలో వారంతా ప్లేట్ల కోసం పోటీపడ్డారు. దీంతో కొన్ని ప్లేట్లు విరిగి కిందపడ్డాయి. ఈ దృశ్యాలపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రపంచస్థాయి సదస్సులో ఇలాంటి ఏర్పాట్లు బాధాకరమంటూ మండిపడ్డాయి. ఫిబ్రవరి 24–25 తేదీల్లో ఈ ఇన్వెస్టర్ల సదస్సు జరిగింది. ఇందులో తమ రాష్ట్రంలో రూ.26.61లక్షల కోట్ల పైగా పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరినట్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వెల్లడించారు. ఈ ప్రతిపాదిత ఒప్పందాలు అమలైతే రాష్ట్రంలో 17.3లక్షల ఉపాధి అవకాశాలు సృష్టించొచ్చని తెలిపారు.

## ఆ నేతలు కుంభమేళాకు
## వెళ్లలేదు.. బహిష్కరించండి
### కేంద్రమంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



**ఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ , శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే లపై కేంద్రమంత్రి రాందాస్ ఆఠవలే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ, ఉద్ధవ్ ఠాక్రే మహాకుంభమేళాను సందర్శించకుండా హిందూ సమాజాన్ని అవమానపరిచారన్నారు. అందుకుగాను హిందూ ఓటర్లు వారిని బహిష్కరించాలని.. ఎన్నికల్లో వారి పార్టీలకు ఓట్లు వేయొద్దని అన్నారు. తరచూ సమావేశాల్లో హిందుత్వం గురించి మాట్లాడే ఠాక్రే ఈ విధంగా ప్రవర్తించడం సరైన చర్య కాదని మండిపడ్డారు.ఈ విషయంలో వారు కనీసం ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాల్సిందని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో హిందూ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి, ఉద్ధవ్ ఠాక్రే తగిన గుణపాఠం చెప్పినా వారి తీరులో ఎటువంటి మార్పు లేదని దుయ్యబట్టారు. జనవరి 13న ప్రయాగ్‌రాజ్‌లో మొదలైన మహా కుంభమేళా నేటితో ముగియనుంది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో కోట్లాదిమంది భక్తులతో పాటు పలువురు రాజకీయ నేతలు, వ్యాపార, సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొని పుణ్య స్నానాలు ఆచరించారు.

## భవిష్యత్తులో మంచి ప్రదర్శనలు

# ఇవ్వాలనేదే నా ఉద్దేశ్యం

### భారత పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా

భారత పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తన అద్భుతమైన ప్రదర్శనకు గాను ఐసీసీ గౌరవాలను అందుకున్నాడు. 2024లో అన్ని ఫార్మాట్లలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన బుమ్రా, "సర్ గార్ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ"తో పాటు ఐసీసీ పురుషుల క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, ఐసీసీ టెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను అందుకున్నాడు. అంతేకాక, అతను ఐసీసీ టెస్ట్, టీ20%×% టీమ్ ఆఫ్ ది ఇయర్‌లో చోటు సంపాదించాడు. పాకిస్థాన్‌తో భారత్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌కు ముందు, బుమ్రా దుబాయ్‌లో తన అవార్డులను స్వీకరించాడు. ఈ సందర్భంగా తన చిన్ననాటి హీరోలు గెలుచుకున్న ఈ అవార్డు తనకూ దక్కడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పాడు. "చిన్నప్పుడు ఈ ట్రోఫీని చాలా మంది దిగ్గజ ఆటగాళ్లు గెలుచుకున్నారు. ఇప్పుడు నేనూ అదే గౌరవాన్ని పొందడం చాలా ప్రత్యేకమైన అనుభూతి" అని బుమ్రా వ్యాఖ్యానించాడు. 2024లో బుమ్రా అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచాడు. టెస్టుల్లో 71 వికెట్లు తీసి అగ్రస్థానంలో నిలిచాడు. వెస్టిండీస్, %ఖూూ%లో జరిగిన పురుషుల %ు%20 ప్రపంచకప్‌లో కూడా అతని



ప్రభావం స్పష్టంగా కనిపించింది. తన అసాధారణ బౌలింగ్‌తో భారత్‌ను 11 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ గెలుచుకునేలా చేశాడు. టెస్టుల్లో 14.92 సగటుతో వికెట్లు తీసిన బుమ్రా, బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్ టూర్‌లలో తన దూకుడు చూపించాడు. %ు%20 ప్రపంచకప్‌లో 4.17 ఎకానమీతో 15 వికెట్లు తీసి భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. "మేము గెలిచిన %ు%20 ప్రపంచకప్ ఎప్పటికీ ప్రత్యేకమే. 2024లో మా టీమ్‌కు అనేక అనుభవాలు ఎదురయ్యాయి. టెస్టులు ఎక్కువగా ఆడాం, కొత్త పరిస్థితులను ఎదుర్కొన్నాం. ఈ ప్రయాణం నాకు చాలా నేర్పింది. భవిష్యత్తులో కూడా మంచి ప్రదర్శనలు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఉన్నాను" అని బుమ్రా చెప్పాడు. ఈ ఏడాది ప్రారంభంలో వెన్నునొప్పి కారణంగా బుమ్రా కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే, మహ్మద్ షమీ గాయంతో దూరంగా ఉన్న సమయంలో బుమ్రా భారత్ బౌలింగ్ యూనిట్‌ను ముందుండి నడిపించాడు. షమీ తిరిగి జట్టులోకి వచ్చిన తర్వాత, అతని కమ్‌బ్యాక్‌పై బుమ్రా సంతోషం వ్యక్తం చేశాడు. "అతను చాలా కాలం గాయంతో బాధపడ్డాడు. కానీ ఇప్పుడు తిరిగి వచ్చి మళ్లీ తన బౌలింగ్ నైపుణ్యాన్ని చూపిస్తున్నాడు. అతను జట్టుకు మరింత సహాయ పడతాడని ఆశిస్తున్నాను" అని బుమ్రా అభిప్రాయపడ్డాడు. భారత బౌలింగ్ యూనిట్ అద్భుతంగా రాణిస్తోండగా, బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీలో తన జట్టుకు మరింత విజయాలు అందించాలని కోరుకుంటున్నాడు. అతని ప్రదర్శన భారత్ విజయంలో కీలకంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## ఇండియాతో ఓటమికి ప్రధాన కారణం అదే : పాకిస్థాన్ కోచ్

ఛాంపియన్స్ ట్రోఫీలో ఆతిథ్య పాకిస్థాన్ లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ గా బరిలోకి దిగిన ఆ జట్టు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలై నాకౌట్‌కు చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. తొలుత న్యూజిలాండ్ చేతిలో పరాజయం పాలైన పాక్.. తర్వాత టీమ్‌ఇండియా చేతిలో చిత్తయింది. ఈ నేపథ్యంలో గురువారం బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్‌లో గెలిచి పరువు కాపాడుకోవాలని పాకిస్థాన్ భావిస్తోంది. బంగ్లాతో మ్యాచ్‌కు ముందు పాక్ కోచ్ అకిబ్ జావేద్ మీడియాతో మాట్లాడాడు. ఒక్క దుబాయ్‌లోనే మ్యాచ్‌లు ఆడటం టీమ్‌ఇండియాకు కలిసొస్తుందని కొందరు చెబుతున్నారు.. అయితే, భారత్‌తో ఓటమికి దానిని సాకుగా చూపబోమని పేర్కొన్నాడు. 'టీమ్‌ఇండియా ఒక నిర్దిష్ట కారణంతో దుబాయ్‌లో మాత్రమే మ్యాచ్‌లు ఆడుతోంది. ఒకే గ్రౌండ్‌లో ఆడటం, ఒకే హోటల్‌లో ఉండటం వల్ల కచ్చితంగా ప్రయోజనం ఉంటుంది. కానీ మేం దాని వల్ల ఓడిపోలేదు. మాతో మ్యాచ్‌కు ముందు టీమ్‌ఇండియా దుబాయ్‌లో 10 మ్యాచ్‌లేమీ ఆడలేదు' అని అకిబ్ వివరించాడు. భారత్‌తో ఓటమిపాలవడంతో పాక్ జట్టుపై స్వదేశంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాజీ ఆటగాళ్లు సైతం పాక్ జట్టుపై మండిపడుతున్నారు. ఈ విషయంపై పాక్ కోచ్ స్పందించాడు. టీమ్‌ఇండియా చేతిలో ఓటమితో అభిమానుల కంటే ఆటగాళ్లే ఎక్కువ బాధపడ్డారని పేర్కొన్నాడు. అనుభవజ్ఞులైన ఆటగాళ్లు లేకపోవడం వల్ల భారత్ చేతిలో ఓటమి చవిచూశామని వ్యాఖ్యానించాడు. "మేము జట్టును మెరుగుపర్చడానికి మాత్రమే ప్రయత్ని స్తాం. వేరే మార్గం లేదు. మేం తదుపరి మ్యాచ్‌పై దృష్టి పెడుతున్నాం. కానీ భారత్–పాకిస్థాన్ మ్యాచ్ విషయంలో చాలా భావోద్వేగాలు ముడిపడి ఉంటాయి. మానసికంగా ఇబ్బందికి గురవుతారు. అభిమానులు, జర్నలిస్టుల కంటే ఆటగాళ్లు చాలా రెట్లు ఎక్కువ బాధపడ్డారు. భారత్‌లాంటి జట్టుతో ఆడాలంటే చాలా అనుభవం అవసరం. ప్రస్తుతం ఉన్న భారత జట్టు అత్యంత అనుభవజ్ఞులతో నిం డి ఉ ంది. మా జట్టులో అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఎక్కువగా లేరు. ప్రస్తుతం టీమ్‌లో ఉన్న వారిలో బాబర్ అజామ్ ఒక్కడే 100 కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడాడు. మహ్మద్, రిజ్వాన్‌లకు కొంత అను భవం ఉంది. మిగతా ప్లేయర్లందరూ 30 కంటే తక్కువ మ్యాచ్‌లు ఆడారు' అని అకిబ్ వివరించాడు. ఛాంపియన్స్ టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తుండగా.. భారత మ్యాచ్‌లు మాత్రం దుబాయ్‌లో నిర్వహిస్తున్నారు. సెమీ ఫైనల్ మ్యాచ్ కూడా దుబాయ్‌లోనే జరగనుంది. ఒకవేళ భారత్ ఫైనల్ చేరితే ఆ మ్యాచ్ కూడా యూఏఈలోనే నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. భద్రతా కారణాల వల్ల టీమ్‌ఇండియాను పాకిస్థాన్‌కు పంపడానికి భారత్ నిరాకరించిన విషయం తెలిసిందే.



## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ విడుదల

### టాప్5లోకి దూసుకొచ్చిన విరాట్ కోహ్లీ

ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తిరిగి టాప్–5కి చేరుకున్నాడు. ఒక స్థానం మెరుగుపరుచుకుని ఐదో స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. ఇక బాబర్ అజామ్, శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్ వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. యంగ్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ 9వ ర్యాంకులోనే కొనసాగుతుండగా, కేఎల్ రాహుల్ రెండు స్థానాలు మెరుగై 15వ ర్యాంక్‌కు చేరుకున్నారు. మరోవైపు, బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో శ్రీలంక స్టార్ స్పిన్నర్ మహీశ్ తీక్షణ టాప్ పొజిషన్‌లో ఉన్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో రషీద్ ఖాన్, కుల్‌దీప్ యాదవ్ ఉ న్నారు. అయితే గాయం నుంచి కోలుకుని ప్రస్తుత జట్టులో రాణిస్తున్న టీమ్‌ఇండియా స్టార్ మహ్మద్ సిరాజ్ మాత్రం రెండు స్థానాలకు దిగజారి 12వ ర్యాంకుకు పడిపోగా, షమి ఒక స్థానం మెరుగై 14వ ర్యాంకులో నిలిచాడు. ఇదిలా ఉండగా, ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో టాప్–10లో ఈ సారి ఎటువంటి మార్పులు లేవు. అఫ్గానిస్థాన్ స్టార్ క్రికెటర్ మహ్మద్ నబీ టాప్ పొజిషన్‌లో ఉండగా, రవీంద్ర జడేజా 9వ ర్యాంకులో కొనసాగుతు న్నారు. న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ మైకేల్ బ్రాస్‌వెల్ ఏకంగా 26 స్థానాలు ఎగబాకి 11వ ర్యాంక్‌కు చేరుకు న్నాడు. టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సూపర్ సెంచరీతో అదరగొట్టాడు. కొంతకాలంగా తనపై వస్తున్న విమర్శలకు విరాట్ అద్భుత శతకంతో సమాధానమి చ్చాడు. 100 (116 బంతుల్లో) అదరగొట్టాడు. విరాట్‌కు వన్డేల్ల ఇది 52వ సెంచరీ కాగా, ఓవరాల్‌గా 82వ అంతర్జాతీయ శతకం. ఈ లిస్ట్‌లో విరాట్ కంటే ముందు సచిన్ తెందూల్కర్ (100 సెంచరీలు) ఒక్కడే ముందు న్నాడు. ఈ మ్యాచ్‌లోనే విరాట్ మరో ఘనత సాధించాడు. ఇప్పుడా స్కోరే తన ర్యాంకింగ్స్ మెరుగుపడేందుకు దోహదపడిందని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. కాగా, ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ఈ విజయంలో విరాట్ సెంచరీతో కీలక పాత్ర పోషించింది. వన్ డౌన్‌లో క్రీజులోకి వచ్చిన విరాట్ మ్యాచ్ పూర్తి చేశాడు. ఈ క్రమంలోనే కెరీర్‌లో 52వ సెంచరీ నమోదు చేశాడు. ఓవరాల్‌గా విరాట్‌కు ఇది 82వ అంతర్జాతీయ శతకం.



## ఉత్కంఠ పోరులో

# అఫ్గాన్ విజయం

### ఇంగ్లాండ్ ఇంటికి

**లాహోర్:** ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో అఫ్గానిస్థాన్ 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. అఫ్గాన్ నిర్దేశించిన 326 పరుగుల భారీ లక్ష్యఛేదనలో ఇంగ్లాండ్ 49.5 ఓవర్లలో 317 పరుగులకు ఆలౌటైంది. ఈ విజయంతో అఫ్గాన్ సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకోగా.. ఇంగ్లాండ్ వరుసగా రెండో ఓటమితో నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది. జో రూట్ (120, 111 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ బాదినా ఇంగ్లాండ్‌కు ఓటమి తప్పలేదు. బెన్ డకెట్ (38), జోస్ బట్లర్ (38), జేమీ ఒవర్టన్ (27) పరుగులు చేశారు. అఫ్గాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 5, మహమ్మద్ నబీ 2, రషీద్ ఖాన్, గుల్బాదిన్ నైబ్, ఫజల్ హక్ ఫారూఖి ఒక్కో వికెట్ పడగొట్టారు.

#### ఇబ్రహీం జద్రాన్ విధ్వంసం..

తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గాన్.. ఇబ్రహీం జద్రాన్ (177, 146 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్స్‌లు) విధ్వంసంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో జద్రాన్.. ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక స్కోరు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అజ్మతుల్లా ఒమర్జాయ్ (41, 31 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), మహమ్మద్ నబీ (40, 24 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగి ఆడారు. హష్మతుల్లా షాహిది (40, 67 బంతుల్లో 3 ఫోర్లు) రాణించాడు. తొలుత జోఫ్రా ఆర్చర్ (3/64) ధాటికి అఫ్గాన్ 37 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడినప్పటికీ.. హష్మతుల్లాతో కలిసి జద్రాన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. క్రీజులో కుదురుకున్న తర్వాత జద్రాన్ విశ్వరూపం ప్రదర్శించాడు. 15 ఓవర్లకు 56/3 ఉ న్న స్కోరు జద్రాన్ దూకుడుతో పరుగులు పెట్టింది. అతడు 106 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు, ఒమర్జాయ్ కూడా దూకుడుగా ఆడటంతో 40 ఓవర్లకు స్కోరు 212/5కి చేరింది. సెంచరీ తర్వాత జద్రాన్ చెలరేగి ఆడాడు. ఆర్చర్ వేసిన 44వ ఓవర్‌లో ఒక సిక్స్‌తోపాటు వరుసగా మూడు ఫోర్లు బాదాడు. నబీ కూడా దూకుడు ప్రదర్శించడంతో అఫ్గాన్ భారీ స్కోరు సాధించింది.

## రంజీ ట్రోఫీ ఫైనల్..

### శతకం బాదిన యువ బ్యాటర్



**నాగ్‌పూర్:** దేశవాళీ క్రికెట్‌లో అత్యున్నత టోర్నీ రంజీ ట్రోఫీ తుది అంకానికి చేరుకుంది. 2024–25 సీజన్‌లో ఛాంపియన్‌గా నిలవడం కోసం కేరళ, విదర్భ జట్లు ఫైనల్‌లో తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విదర్భ తొలి రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు కోల్పోయి 254 పరుగులు చేసింది. డానిష్ మాలేవర్ (138, బ్యాటింగ్ 259 బంతుల్లో 14 ఫోర్లు, 2 సిక్స్‌లు), యశ్ ఠాకూర్ (5లి బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. కరుణ్ నాయర్ (86, 188 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. విదర్భకు శుభారంభమేమీ దక్కలేదు. పార్థ్ రేఖడే (0), దర్శన్ నల్కండే (1)లను నిధీష్ వెనక్కి పంపగా.. ధ్రువ్ షోరే (16)ను ఈడెన్ ఆపిల్ టామ్ ఔట్ చేశాడు. దీంతో విదర్భ 23 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో డానిష్ మాలేవర్, కరుణ్ నాయర్ జట్టును ఆదుకున్నారు. ఈ జోడీ మూడో వికెట్‌కు 215 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. సొంతగడ్డపై ఫైనల్ మ్యాచ్ ఆడుతున్న 21 ఏళ్ల మాలేవర్ 167 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. డానిష్ 93 పరుగుల తర్వాత సిక్స్, ఫోర్‌తో శతకం అందుకున్నాడు. సెంచరీ చేసేలా కనిపించిన కరుణ్ నాయర్ రనౌట్‌గా వెనుదిరిగాడు.

## టెస్లా షేర్లు పతనం..

### మస్క్ సంపద ఒక్క రోజులోనే 1.9 లక్షల కోట్లు ఆవిరి



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సంపద మంగళవారం భారీగా కుంగింది. ఒక్కరోజు ఏకంగా 22.2 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది. భారతీయ కరెన్సీ ప్రకారం దాదాపు రూ.1.91 లక్షల కోట్లు అన్నమాట. టెస్లా షేర్ల పతనం క్రమంగా నాలుగో రోజూ కొనసాగడమే ఇందుకు కారణం. టెస్లా కార్ల విక్రయాలు యూరప్‌లో 45 శాతం క్షీణించాయి. యూరప్‌లో మొత్తం ఈవీ విక్రయాలు జోరందుకున్నప్పటికీ టెస్లా విక్రయాలు తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ప్రపంచవ్యాప్తంగా టెస్లాకు ఉన్న డిమాండ్‌పై ఆందోళనలు నెలకొల్పింది. దీంతో న్యూయార్క్‌లో టెస్లా షేర్లు నిన్న ఒక్కరోజే 8.4 శాతం క్షీణించాయి. అలా కంపెనీ విలువ 1 ట్రిలియన్ డాలర్ల దిగువకు చేరింది. నవంబర్ 7 తర్వాత కంపెనీ మార్కెట్ విలువ తొలిసారిగా ఈ స్థాయికి దిగి వచ్చింది. మస్క్ సంపద సగానికి పైగా టెస్లాలోనే ఉంది. టెస్లా షేర్లు కుంగడంతో మస్క్ సంపద ఏకంగా 22.2 బిలియన్ డాలర్లు పతనమైంది. ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలు, ఫెడ్ తన వ్యయాల్ని తగ్గించుకొనే ప్రయత్నాలు, సుంకాలు సహా పలు చర్యలు చేపడుతున్నప్పటికీ అమెరికా మార్కెట్లు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో అమెరికా ప్రధాన సూచీ ఎస్అండ్‌పీ 500.. 3.1 శాతం పడిపోయింది. ఏడు మెగాక్యాప్ టెక్ కంపెనీలను ట్రాక్ చేసే మాగ్నిఫిసెంట్ 7 ఇండెక్స్ సైతం మంగళవారం ట్రేడింగ్ సెషల్‌లో కుంగింది.


## పునరుత్పాదక ఇంధన విభాగంలోకి మైక్రోమ్యాక్స్ ఎంట్రీ

ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన దేశీయ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ మైక్రోమ్యాక్స్ కొత్త వ్యాపార విభాగంలోకి అడుగుపెట్టింది. పునరుత్పాదక ఇంధన సెగ్మెంట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. దీనికోసం 'స్టార్టప్ ఎనర్జీ'ని లాంచ్ చేసినట్లు కంపెనీ బుధవారం తెలిపింది. ఈ కొత్త వెంచర్ ద్వారా సోలార్ ప్యానెల్ తయారీలోకి మైక్రోమ్యాక్స్ ప్రవేశించనుంది. భారత్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న క్లీన్ ఎనర్జీ మిషన్‌కు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడించింది. క్లీన్ ఎనర్జీ వైపు ప్రపంచ పరుగులు పెడుతున్న తరుణంలో దేశీయంగా చేపడుతున్న పునరుత్పాదక ఇంధన విప్లవంలో తన స్టార్టప్ ఎనర్జీ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని తెలిపింది. ఇందులో భాగంగా 5 గిగావాట్స్ సామర్థ్యం కలిగిన అధునాతన సోలార్ ప్యానెల్ తయారీని దశలవారీగా నెలకొల్పేందుకు చైనాకు చెందిన జిన్‌చెన్‌తో మైక్రోమ్యాక్స్ వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. "క్లీన్ ఎనర్జీని అందరికీ అందుబాటులోకి తేవాలని, సరసమైన ధరలో అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నివాసితులు, వ్యాపారుల కోసం అధిక సామర్థ్యం కలిగిన సౌర ఫలకాలను ఉత్పత్తి చేయడంపై మేం దృష్టి పెడతాం" అని మైక్రోమ్యాక్స్ ఎండీ రాజేష్ అగర్వాల్ తెలిపారు.

### పౌరులందరి కోసం

## సార్వత్రిక పెన్షన్ స్కీమ్..

### కేంద్రం కసరత్తు..



**న్యూఢిల్లీ :** దేశంలోని పౌరుల కోసం కేంద్రం కొత్త పింఛను పథకం ఒకటి తీసుకురానుంది. 60ఏళ్లు పైబడిన వారందరికీ పెన్షన్ అందించే ఉద్దేశంతో సార్వత్రిక పెన్షన్ స్కీమ్‌పై కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి సామాజిక భద్రత పథకానికీ నోచుకోని నిర్మాణరంగ కార్మికులు, గిగ్ వర్కర్లు వంటి వారికి ప్రయోజనం కల్పించే ఉద్దేశంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు కార్మిక శాఖ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. పదవీ విరమణ అనంతరం పింఛను అందించేందుకు ఉద్యోగులకు ఉద్యోగ భవిష్యనిధి సంస్థ ఉంది. ఏదైనా కంపెనీలో వ్యక్తి పనిచేస్తున్నప్పుడు.. అతడి వేతనం నుంచి 12 శాతం చొప్పున అతడి ఈపీఎఫ్ ఖాతాకు జమ అవుతుంది. పనిచేస్తున్న సంస్థ సైతం అంతే మొత్తంలో జమ చేస్తుంది. ఇక్కడ ప్రభుత్వం ఎలాంటి జమ చేయడం లేదు. దీంతో పాటు సంఘటిత రంగంలో పనిచేసే వారి కోసం అటల్ పెన్షన్ యోజన, వీధి వ్యాపారుల కోసం ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్‌దాన్ యోజన, రైతుల కోసం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌దాన్ యోజన వంటి పథకాలు ఉన్నాయి. వీటికి కొంత మొత్తం పౌరులు చెల్లిస్తుండగా.. ఇంకొంత మొత్తం ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో పౌరులందరికీ ఒకటే తరహా పెన్షన్ పథకం తేవాలని కేంద్రం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న పొదుపు, పింఛను పథకాలను హేతుబద్ధీకరించి ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉద్యోగం చేస్తున్న వారితో పాటు ఉద్యోగంలో లేనివారు సైతం ఈ స్కీమ్‌లో చేరొచ్చు. అంటే స్వయం ఉపాధి అవకాశాలు పొందుతున్నవారూ దీంట్లో చేరొచ్చన్నమాట. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలపై కసరత్తు ప్రారంభమైందని, త్వరలోనే దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని అధికారి ఒకరు వెల్లడించారు. నేషనల్ పెన్షన్ స్కీమ్ యథాతథంగా కొనసాగుతుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.




## యూపీఐ లైట్‌లో కొత్త సదుపాయం

### త్వరలో బ్యాలెన్స్ విత్ డ్రా ఆప్షన్

**న్యూఢిల్లీ :** చిన్న మొత్తాల్లో చేసే డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన యూపీఐ లైట్ సేవలు వినియోగం క్రమంగా పెరుగుతోంది. దీంతో ఈ సేవల్ని మరింత మెరుగుపరిచేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిద్ధమైంది. ఇప్పటివరకు అందుబాటులో లేని బ్యాలెన్స్ 'విత్ డ్రా' ఆప్షన్‌ను యూపీఐ లైట్‌లో తీసుకురావాలని చూస్తున్నట్లు సమాచారం. ఎలాంటి పిన్ ఎంటర్ చేయకుండానే యూపీఐ పేమెంట్స్ చేయడానికి యూపీఐ లైట్ సేవలు సహకరిస్తాయి. ఇది "వన్ వే" సేవ. అంటే ఈ ఖాతాలో డబ్బులు జమ చేసే సదుపాయం మాత్రమే ఉంటుంది. దాన్ని ఉపసంహరించుకొనే అవకాశం ఉండదు. ఒకవేళ ఆ అకౌంట్‌లో నిధుల్ని ఉపసంహరించుకోవాలనుకుంటే యూపీఐ లైట్ ఖాతాను నిలిపివేయాల్సిందే. మరో మార్గం లేదు. ఇకపై ఆ సమస్య లేకుండా సొమ్మని విత్‌డ్రా చేసే సదుపాయం రానుంది. త్వరలో ఈ సేవను తీసుకొచ్చేందుకు ఎన్‌పీసీఐ సిద్ధమవుతోంది. నగదు విత్‌డ్రాకు వీలు కల్పించాలని పేర్కొంటూ బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లకు లేఖ రాసింది. మార్చి 31 నాటికి నగదు విత్‌డ్రా కోసం 'ట్రాన్స్‌ఫర్ అవుట్' ఆప్షన్ అందుబాటులోకి రానుందని తెలుస్తోంది.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
Regional
గురువారం 27 ఫిబ్రవరి 2025





# యాక్టింగే తన ఫస్ట్ లవ్ : సమంత

తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో స్టార్ నటి సమంత ఒకరు. అయితే, సామ్ గత కొంతకాలంగా గడ్డుపరిస్థితుల్ని ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే. నాగ చైతన్యతో విడాకుల అనంతరం కొద్దిరోజులకే మయోసైటిస్ బారిన పడింది. దాన్నుంచి కోలుకునేందుకు సినిమాలకు లాంగ్ బ్రేక్ ఇచ్చింది. ఇంతలోనే తన తండ్రి జోసెఫ్ ప్రభు హఠాత్తుగా మరణించడం.. తన మాజీ భర్త రెండో పెళ్లి చేసుకోవడం సామ్‌ను తీవ్రంగా బాధించాయి. వీటన్నింటి నుంచి తేరుకుని ఇప్పుడిప్పుడే.. మళ్లీ తిరిగి తన వర్క్‌లైఫ్‌లో బిజీగా మారింది. వరుణ్ ధావన్‌తో కలిసి 'సిటాడెల్ : హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌లో మెరిసిన సమంత.. ప్రస్తుతం రాజ్ అండ్ డీకే తెరకెక్కిస్తున్న వెబ్ సిరీస్ 'రక్త్ బ్రహ్మాండ్' షూట్‌లో జాయిన్ అయింది. ఈ నేపథ్యంలో కొంతకాలం విరామం తర్వాత మళ్లీ సినిమాల్లోకి రావడం పట్ల సమంత స్పందించారు. ఇకపై విరామం తీసుకోనని ప్రకటించారు. యాక్టింగ్ తన ఫస్ట్ లవ్ అని పేర్కొన్నారు. 'సినిమాలు నా మొదటి ప్రేమ. నేను ఇకపై నటనకు విరామం తీసుకోను. ఇప్పటికే చాలా గ్యాప్ ఇచ్చాను. తిరిగి మీ సామ్ మీ ముందుకు వరుస చిత్రాలతో వస్తుంది' అని ప్రకటించింది. ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్' పూర్తి చేసే పనిలో ఉన్నట్లు తెలిపింది. ఆ తర్వాత మరో చిత్రం కూడా రెండు నెలల్లో సెట్స్ మీదకు వెళ్తుందని పేర్కొంది. కాగా, విజయ్ దేవరకొండతో చివరగా ఖుషి సినిమాలో నటించింది సమంత. ఈ సినిమా తర్వాత తెలుగులో మళ్లీ కొత్త ప్రాజెక్టు ప్రకటించలేదు. ప్రస్తుతం తన కొత్త వెబ్ సిరీస్ వెబ్ సిరీస్ షూట్‌లో జాయిన్ అయింది.



## కొత్త ఇన్నింగ్స్‌కి సిద్ధమవుతున్న పీసీ

గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా ప్రస్తుతం హాలీవుడ్ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉంది. ఇటీవలే ఈ అమ్మడు తెలుగులో రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న సినిమాకు ఓకే చెప్పిన విషయం తెల్సిందే. ఆ సినిమా కాకుండా మరే ఇండియన్ మూవీస్‌లోనూ ఈ అమ్మడు నటించడం లేదు. హాలీవుడ్‌లో ఈమె సినిమాలతో పాటు, వెబ్ సిరీస్‌ల్లోనూ నటిస్తుంది. ముఖ్యంగా ప్రియాంక చోప్రా నటించిన హాలీవుడ్ వెబ్ సిరీస్ సిటాడెల్‌కి మంచి స్పందన వచ్చింది. దాంతో ప్రియాంక చోప్రా మరిన్ని వెబ్ సిరీస్‌లను చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రియాంక చోప్రా దారిలోనే ఆమె కజిన్ పరిణీతి చోప్రా (పీసీ) సైతం వెబ్ కంటెంట్‌లో అరంగేట్రంకి సిద్ధం అవుతుంది. ఇటీవల 'చంకీలా' సినిమాతో ఓటీటీ ప్రేక్షకుల ముందుకు పరిణీతి చోప్రా వచ్చింది. థియేట్రికల్ రిలీజ్‌ను స్కిప్ చేసిన మేకర్స్ నేరుగా ఓటీటీ ద్వారా చంకీలా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో వచ్చిన అమర్ సింగ్ చంకీలా సినిమా నెట్ ఫ్లిక్స్‌లో సెన్సేషల్ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో ముందు ముందు మరిన్ని వెబ్ కంటెంట్‌లో నటించాలనే ఉద్దేశంతో పరిణీతి చోప్రా ఉందని తెలుస్తోంది. అందుకే ఇటీవల సోను రజ్జాన్, జెన్నిఫర్ వింగెట్‌లతో ఒక మిస్టరీ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌లో నటించేందుకు సిద్ధం అయింది. పరిణీతి చోప్రా బాలీవుడ్‌లో అడుగు పెట్టి చాలా సంవత్సరాలు అయింది. ఈమెతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మలు టాప్ స్టార్ హీరోయిన్స్‌గా పేరు దక్కించుకున్నారు. కానీ ఈమెకు మాత్రం ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కలేదు. స్టార్ హీరోయిన్‌లతో పోటీలో ఈమె వెనుక పడింది. పెద్ద సినిమాల్లో ఈమెకు ఆఫర్లు దక్కలేదు. చేసిన సినిమాలు కొన్ని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకోలేదు. దాంతో అమర్ సింగ్ చంకీలా ప్రాజెక్ట్‌తో ఓటీటీలో అడుగు పెట్టింది. తక్కువ సమయంలోనే ఈ అమ్మడు ఓటీటీలో మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. అందుకే వెండి తెరపై దక్కని గుర్తింపును ఓటీటీ ద్వారా ఈ అమ్మడు దక్కించుకునే ప్రయత్నాలు చేస్తుంది.



# ఆయన పక్కన లేకపోతే కష్టంగా ఉంది : రకుల్

అతి తక్కువ సమయంలో టాలీవుడ్ అగ్ర కథానాయికగా ఎదిగారు రకుల్ ప్రీత్ సింగ్, స్టార్ హీరోలు అందరితోనూ ఆమె యాక్ట్ చేసింది. జాకీ భగ్నానీతో పెళ్లి తర్వాత పూర్తిగా ముంబై మకాం మార్చేసింది. గతేడాది ఫిబ్రవరి 21న జాకీతో ఆమె పెళ్లి జరిగింది. ప్రేమ వివాహంతో ఒకటైన ఈ జంట ఇటీవలే తమ మొదటి వివాహ వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకున్నారు. అయితే షూటింగ్ సమయంలో తన భర్తను చాలా మిస్ అవుతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు. సినిమా షూటింగ్ సమయంలో మా ఆయనను బాగా మిస్ అవుతున్నట్టు అనిపిస్తుంటుంది. అయన పక్కన లేకపోతే చాలా కష్టంగా ఉంది. ఆ సమయంలో అతనికి దూరంగా ఉన్నాను అనే ఫీల్‌ను పోగొట్టుకోవడానికి ఆయన స్వెట్ షర్ట్స్‌ను ధరిస్తున్నాను" అంటూ చెప్పుకొచ్చింది. ఓ సెల్ఫీ ఫొటోను పంచుకుంది రకుల్. అందులో ఆమె 'జేబీ' అనే పేరుతో భర్త పేరును సూచించే హుడి ధరించి ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. ఇటీవల మేరే హస్బెండ్ కే బీవీ' సినిమాతో బాలీవుడ్ ప్రేక్షకుల ముందుకొచ్చింది రకుల్. తదుపరి ఆమె చేతిలో ఇండియన్ 3, దేదే ప్యార్ దే 2 చిత్రాలున్నాయి. తెలుగులో అయితే ఆమె సైన్ చేసిన సినిమా ఒకటీ లేదు.